12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు
విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 254 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : చిత్తూరు సోమవారం 21 సెప్టెంబర్ 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE :254 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : CHITTOOR MON 21 SEPTEMBER 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur

# ఎల్‌నినోని సవాల్‌గా తీసుకుందాం

- ఎల్ నినో ప్రభావం, ప్రభుత్వ కార్యాచరణపై సీఎం చంద్రబాబు సమీక్ష
- రైతులను ఆదుకోవడం, నిత్యావసరాల ధరల నియంత్రణే ప్రధాన లక్ష్యం
- బియ్యం, ఉల్లి, పామాయిల్, కందిపప్పు ధరలు అదుపులో ఉంచాలని ఆదేశం
- డిమాండ్‌కు తగిన పంటల సాగు, వర్షాధార వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని సూచన
- విపత్తును ఎదుర్కొనేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం



**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం, తీసుకోవాల్సిన చర్యలు, కార్యాచరణ ప్రణాళిక అమలుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు, ఆర్‌ఎస్కే సిబ్బందితో ఆయన టెలికాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఎల్ నినో వంటి విపత్కర పరిస్థితుల్లో రైతులను ఆదుకోవడం, మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు పెరగకుండా నియంత్రించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని ఆయన స్పష్టం చేశారు. ఈ విపత్తును ఒక సవాలుగా స్వీకరించి, ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, "ఎల్ నినో పరిస్థితులను మనం ముందుగానే అంచనా వేశాం. దీనికోసం సిద్ధం చేసుకున్న యాక్షన్ ప్లాన్ ప్రకారం ప్రతి ఒక్కరూ పనిచేయాలి. ఎల్ నినో ప్రభావం కేవలం రైతులపైనే కాదు, అన్ని వ్యవస్థలపైనా పడుతుంది. కాబట్టి రైతులను కాపాడుకుంటూనే, వినియోగదారులపై ధరల భారం పడకుండా చూడటం మన బాధ్యత" అని అన్నారు. బియ్యం, ఉల్లి, పామాయిల్, కందిపప్పు వంటి నిత్యావసరాల ధరలను కచ్చితంగా అదుపులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. గోదాముల్లోని బియ్యం నిల్వలను మార్కెట్‌లోకి విడుదల చేసి, ధరలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉల్లి కొరతను అధిగమించేందుకు ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేయడంతో పాటు, భవిష్యత్ డిమాండ్‌కు అనుగుణంగా ఉల్లి సాగును ప్రోత్సహించాలని తెలిపారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను వివరిస్తూ, రాష్ట్రవ్యాప్తంగా 50.7 శాతం లోటు వర్షపాతం నమోదైందని, ముఖ్యంగా ప్రకాశం, అన్నమయ్య, శ్రీ సత్యసాయి జిల్లాల్లో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని అన్నారు. ఖరీఫ్ సీజన్‌లో 30.84 లక్షల హెక్టార్లకు గాను,

- మిగతా 2లో



## వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోంది.. నమ్మొద్దు

### డీఎస్సీ స్పోర్ట్స్ కోటా టీచర్ల విజ్ఞప్తి

- విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించిన 370 మంది ఉపాధ్యాయులు
- ప్రతిభ, పతకాలతోనే ఉద్యోగాలు సాధించామని స్పష్టీకరణ
- స్పోర్ట్స్ కోటాను 3 శాతానికి పెంచిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు
- గాయాల కన్నా ఆరోపణలే ఎక్కువ బాధిస్తున్నాయని ఉపాధ్యాయుల ఆవేదన

- మిగతా 2లో



## టాటా సన్స్ చైర్మన్‌గా ఎన్. చంద్రశేఖరన్ పొడిగింపును సవాల్ చేసిన టాటా ట్రస్ట్స్

**పెన్ పవర్ డెస్క్:**టాటా సన్స్ చైర్మన్‌గా మరో ఐదేళ్ల పాటు కొనసాగేందుకు ఎన్. చంద్రశేఖరన్‌కు కంపెనీ బోర్డు డైరెక్టర్లు ఆమోదం తెలపడాన్ని టాటా ట్రస్ట్స్ సవాల్ చేసింది. కంపెనీ ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్ ప్రకారం, ట్రస్ట్ నామినేట్ చేసిన డైరెక్టర్లలో మెజారిటీ సభ్యుల మద్దతు అవసరమని, చైర్మన్ నిర్ణయాత్మక ఓటు ఆ నిబంధనను అధిగమించలేదని వాదించింది. టాటా సన్స్ షేర్లలో సుమారు

- మిగతా 2లో



## విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌కు 'సర్' నోటీసులు

**పెన్ పవర్ డెస్క్:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా పలువురు ప్రముఖులకు ఎన్నికల సంఘం నోటీసులిస్తోంది. ఇప్పటికే ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, ఆయన కుటుంబ సభ్యులకు నోటీసులివ్వడంపై ప్రతిపక్షాల నుంచి తీవ్ర దుమారం రేగిన సంగతి తెలిసిందే.


- మిగతా 2లో

## అమరావతి కోసం విశాఖను దెబ్బతీస్తున్నారు

- అమరావతి ప్రయోజనాల కోసమే విశాఖను నిర్లక్ష్యం చేస్తున్నారన్న వైసీపీ
- మంత్రి నారా లోకేశ్ బంధువులపై తీవ్ర భూకబ్జా ఆరోపణలు
- స్థానిక ఎన్నికల కోసమే ఇళ్ల పట్టాల పంపిణీ డ్రామా అని విమర్శ
- తాగునీటి సమస్యను పట్టించుకోకుండా సీఎం బాబు ప్రచారానికే పరిమితమయ్యారని ఫైర్



- మిగతా 2లో



### బెంగళూరులో 'ది ఎర్త్ సెంటర్' ప్రారంభోత్సవం..

## హాజరైన సీఎం చంద్రబాబు

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం బెంగళూరులో పర్యటించారు. నగరంలోని ప్రముఖ ఐటీ హబ్ అయిన వైట్‌ఫీల్డ్‌లో అత్యాధునికంగా నిర్మించిన 'ది ఎర్త్ సెంటర్' అనే కమర్షియల్ ఆఫీస్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి

- మిగతా 2లో

## విజయవాడలో వైసీపీ ధర్నాకు అనుమతి లేదు

### డీసీపీ కృష్ణకాంత్ పటేల్


- విజయవాడలో వైసీపీ నిరసనలకు అనుమతి నిరాకరించిన పోలీసులు
- డీఎస్సీ అక్రమాలపై ఆందోళనలకు పిలుపునిచ్చిన వైసీపీ
- వినాయక నిమజ్జనం, ట్రాఫిక్ సమస్యల కారణంగా అనుమతి నిరాకరణ
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- నగరంలో ఇప్పటికే అమల్లో ఉన్న నిషేధాజ్ఞలు

- మిగతా 2లో



### కోర్టు ధిక్కరణ కేసులో ఎల్‌బీ నగర్ మాజీ

## ఏసీపీకి నెల రోజుల జైలు శిక్ష




**పెన్ పవర్ డెస్క్:** మాజీ ఏసీపీ ఎ.కృష్ణయ్యకు తెలంగాణ హైకోర్టు బిగ్ షాకిచ్చింది. కోర్టు ధిక్కరణ కేసులో న్యాయస్థానం ఆయనకు నెల రోజుల కఠిన కారాగార శిక్ష, రూ.2 వేల జరిమానా విధించింది. ఈ మేరకు హైకోర్టు జస్టిస్ కే.సుజన శుక్రవారం (సెప్టెంబర్ 18) ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, జడ్జిమెంట్‌పై అప్పీల్ చేసుకునేందుకు వీలుగా కోర్టు ఆయనకు నాలుగు వారాల సమయం ఇచ్చింది. అప్పటి వరకు తీర్పును సస్పెండ్ చేసింది.

- మిగతా 2లో




## దేశవ్యాప్త బ్యాంకుల సమ్మె..

### ఖాతాదారులకు ఎస్‌బీఐ కీలక సూచన

- ఈ నెల 28 నుంచి 30 వరకు దేశవ్యాప్త బ్యాంకుల సమ్మె
- బ్యాంకు పనులు ముందే పూర్తి చేసుకోవాలని కస్టమర్లకు ఎస్‌బీఐ సూచన
- వారాంతపు సెలవులతో కలిపి ఐదు రోజుల పాటు సేవలకు అంతరాయం
- ఏటీఎం, యూపీఐ, నెట్ బ్యాంకింగ్ సేవలు యథాతథంగా కొనసాగుతాయని వెల్లడి
- 'యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్' సమ్మెకు పిలుపు

- మిగతా 2లో



## ఆ కట్టడాన్ని.. సైనిక కాంప్లెక్స్‌గానూ తీర్చిదిద్దుతాం

**పెన్ పవర్ డెస్క్:** దేశ రాజధాని వాషింగ్టన్ డీసీలో ఓ భారీ విజయ తోరణాన్ని నిర్మించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రణాళికలు రచిస్తున్న విషయం తెలిసిందే. ఈ కట్టడం విషయంలో తాజాగా ఆయన కీలక

- మిగతా 2లో

## ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనానికి ముహూర్తం ఖరారు

- ఈ ఏడాది 12 రోజుల పాటు కొనసాగనున్న ఉత్సవాలు
- సెప్టెంబర్ 25న హుస్సేన్ సాగర్‌లో విగ్రహ నిమజ్జనం
- శ్రీ పంచముఖ సంకటహర మహా గణపతిగా దర్శనమిస్తున్న వినాయకుడు
- అనంత చతుర్దశి రోజున నిమజ్జన కార్యక్రమం:


**పెన్ పవర్ డెస్క్:**హైదరాబాద్‌లోని ప్రసిద్ధ ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం తేదీ ఖరారైంది. ఈ ఏడాది సెప్టెంబర్ 25న, శుక్రవారం రోజున గణనాథుడిని హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనం చేయనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రకటించింది. అనంత చతుర్దశి పర్వదినం సెప్టెంబర్ 25న రావడంతో, అదే రోజు నిమజ్జన కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించారు. ఈ సంవత్సరం ఖైరతాబాద్ వినాయకుడు "శ్రీ పంచముఖ సంకటహర మహా గణపతి"గా భక్తులకు

- మిగతా 2లో



## క్లాస్‌రూం నుంచే సమాజ మార్పు సాధ్యం

- కాకినాడలో చాగంటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో 'భారతీయం' కార్యక్రమం
- హాజరైన ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్
- సాంకేతికతకు భారతీయ విలువలు జోడించి ప్రపంచ విజేతలుగా ఎదగాలని పిలుపు
- ప్రభుత్వ కృషికి నైతిక విలువలు తోడైతే ఏపీ విద్యావ్యవస్థ దేశంలోనే నెం.1 అవుతుందని వ్యాఖ్యలు
- త్యాగధనుల బాటలో పయనించి దేశానికి గర్వకారణంగా నిలవాలని విద్యార్థులకు సూచన



**పెన్ పవర్ డెస్క్:**సాంకేతికతకు భారతీయ విలువలను జోడించడం ద్వారా విద్యార్థులు ప్రపంచ విజేతలుగా ఎదగాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ కృషికి నైతిక విలువలు తోడైతే ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థ దేశంలోనే నెంబర్ వన్ గా రూపుదిద్దుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురంలోని ఆకుండి లక్ష్మీ స్మారక గోశాల ప్రాంగణంలో ఈ కార్యక్రమం జరిగింది. పాఠశాల

- మిగతా 2లో




## పిచ్చోడి చేతిలో.. ప్రపంచం.. ఎప్పుడు ఏ నిర్ణయం తీసుకుంటాడోనన్న భయం

అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ప్రపంచాన్ని ఇబ్బంది పెడుతున్నాడు. మెంటల్ చేష్టలతో తనకు తోచినట్లు వ్యవహరించడంతో ప్రపంచమే అతలాకుతలమవుతుంది. అన్ని దేశాలు ద్రవ్యోల్బణానికి అంచున ఉన్నాయి. ధరలు పెరగడమే కాకుండా.. కొనుగోలు శక్తి తగ్గడంతో ప్రజలు ఆర్థికంగా చితికిపోతున్నారు. పిచ్చోడి చేతిలో రాయిలా... ట్రంప్ చేతిలో అమెరికా అధికారం ఉండటంతో ఇప్పుడు ప్రపంచమే వణికిపోతుంది. ట్రంప్ తీసుకుంటున్న పలు నిర్ణయాలు, అవలంబిస్తున్న విధానాలు ప్రపంచవ్యాప్తంగా తీవ్ర చర్చకు, ఆందోళనకు దారితీశాయనడంలో సందేహం లేదు. ప్రధానంగా ఆర్థిక, విదేశాంగ, పర్యావరణ రంగాలలో ఆయన తీసుకుంటున్న దూకుడు నిర్ణయాలు కొన్ని దేశాలకు లబ్ధి చేకూరుస్తుండగా, అంతర్జాతీయంగా పలు సవాళ్లను మరియు ఇబ్బందులను కూడా సృష్టిస్తున్నాయి.

**అంతర్జాతీయ వాణిజ్య యుద్ధాలు.. సుంకాలు ...**

ట్రంప్ తన 'అమెరికా ఫస్ట్' విధానంలో భాగంగా దిగుమతి సుంకాల ను ఒక ప్రధాన ఆర్థిక ఆయుధంగా వాడుతున్నారు. ఇటీవల ఆయన సంతకం చేసిన చట్టం ప్రకారం రష్యా నుండి క్రూడాయిల్, గ్యాస్ కొనుగోలు చేసే దేశాలపై ఏకంగా 100 శాతం వరకు దిగుమతి సుంకాలు విధిస్తామని హెచ్చరించారు. ఇది భారత్, చైనా వంటి ప్రధాన దేశాల ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది.చైనా, కెనడా, మరియు ఐరోపా దేశాల నుండి వచ్చే వస్తువులపై భారీగా సుంకాలు పెంచడం వల్ల అంతర్జాతీయ సరఫరా చైన్ దెబ్బతినడమే కాకుండా, ప్రపంచ ఆర్థిక వృద్ధి రేటు మందగించే ప్రమాదం ఉందని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ కూడా హెచ్చరించింది. దాదాపు నాలుగు నెలల నుంచి ఇరాన్ పై యుద్ధం చేస్తూ మూడు లక్షల డాలర్ల ను ట్రంప్ తగలపెట్టాడు. మధ్యంతర ఎన్నికల్లో గెలిచేందుకు మరిన్ని పావులు కదుపుతున్నాడు. తమ పార్టీని గెలిపిస్తే ప్రతి ఒక్క అమెరికన్ పౌరుడికి ఐదు వేల డాలర్లు ఇస్తానని ప్రకటించడంతో ట్రంప్ లో భయానికి నిదర్శనమని అంతర్జాతీయ సమాజం కోడై కూస్తుంది.

**విదేశాంగ విధానం...ఇరాన్‌తో ఘర్షణ...**

అమెరికా ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల వల్ల అంతర్జాతీయంగా ఇంధన ధరలు భారీగా పెరిగాయి. వ్యూహాత్మకమైన హోర్ముజ్ జలసంధిమూతపడటం ప్రపంచ చమురు రవాణాను ఇబ్బందుల్లోకి నెట్టింది. నాటో కూటమిలోని సభ్యదేశాలు తమ రక్షణ బడ్జెట్‌ను పెంచకపోతే అమెరికా వారికి రక్షణ కల్పించబోదనే సంకేతాలు ఇవ్వడం ఐరోపా దేశాలలో అభద్రతాభావాన్ని పెంచింది. గ్లోబల్ వార్మింగ్‌ను అరికట్టేందుకు ప్రపంచ దేశాలన్నీ కలిసి చేసుకున్న పారిస్ పర్యావరణ ఒప్పందం నుండి అమెరికా వైదొలుగుతున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఇది గ్లోబల్ క్లైమేట్ లక్ష్యాలకు పెద్ద దెబ్బ అని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఐక్యరాజ్యసమితి నిధులలో కోతలు విధించడం, పలు అంతర్జాతీయ వేదికల నుండి తప్పుకోవడం వల్ల అంతర్జాతీయ సహకారం మరియు సంక్షోభాల పరిష్కారంలో అమెరికా నాయకత్వ పాత్ర బలహీనపడింది. ఉద్యోగం కోల్పోయిన విదేశీ ఐటీ నిపుణులకు (ఎ-1బీ వీసా హోల్డర్లకు) ఇచ్చే 60 రోజుల గ్రేస్ పీరియడ్‌ను రద్దు చేయాలనే ప్రతిపాదనలు తీసుకురావడం, కఠినమైన వీసా నిబంధనలు భారత్ సహా పలు దేశాల యువతను, వారి కుటుంబాలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి

**ట్రంప్ మద్దతుదారుల వాదన ఏంటంటే...**

ట్రంప్ నిర్ణయాలు ప్రపంచాన్ని ఇబ్బందుల్లో పడేస్తున్నాయని ఒక వర్గం విమర్శిస్తున్నప్పటికీ, ఆయన మద్దతుదారులు మాత్రం ఈ నిర్ణయాలను సమర్థిస్తున్నారు. ఈ విధానాలు అమెరికా సొంత ప్రయోజనాలను, దేశీయ ఉపాధిని రక్షించడానికి ఉద్దేశించినవని వారు వాదిస్తారు.మధ్యప్రాచ్యం మరియు ఇతర ప్రాంతాలలో కొన్ని శాంతి ఒప్పందాల కోసం ట్రంప్ యంత్రాంగం చేసిన ప్రయత్నాలను సానుకూల అంశాలుగా వారు ప్రస్తావిస్తున్నారు. మొత్తంగా చూస్తే, ట్రంప్ అనుసరిస్తున్న ఏకపక్ష మరియు దూకుడు నిర్ణయాల వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అనిశ్చితి పెరిగిందనేది వాస్తవం. ఇది మిగిలిన దేశాలు అమెరికాపై పూర్తిగా ఆధారపడకుండా, తమకు తాముగా ప్రత్యామ్నాయ కూటములను ఏర్పరచుకునేలా పురికొల్పుతోంది. దీంతో ట్రంప్ ఎప్పుడు ఎలాంటి నిర్ణయం తీసుకుంటాడో అన్న భయం అన్ని దేశాలను వెంటాడుతుంది. సజావుగా సాగిపోతున్న తరుణంలో ట్రంప్ వచ్చి అన్ని ఛిద్రం చేశాడని శాపనార్థాలు పెడుతున్నారు.

## దేశవ్యాప్త బ్యాంకుల సమ్మె..

దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తమ ఖాతాదారులకు ఒక ముఖ్యమైన ప్రకటన జారీ చేసింది. 'యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్' (యూఎఫ్‌బీయూ) పిలుపు మేరకు ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు మూడు రోజుల పాటు దేశవ్యాప్తంగా బ్యాంకులు సమ్మెకు దిగనున్నాయి.

అయితే, దీనికి ముందు సెప్టెంబర్ 26, 27 తేదీలు శని, ఆదివారాలు కావడంతో వరుసగా ఐదు రోజుల పాటు బ్యాంకు శాఖలలో ప్రత్యక్ష సేవలకు అంతరాయం కలిగే అవకాశం ఉందని ఎస్‌బీఐ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమైన బ్యాంకు లావాదేవీలు ఉన్నవారు సమ్మె కంటే ముందే వాటిని పూర్తి చేసుకోవాలని సూచించింది.

యూఎఫ్‌బీయూ తమ ఆందోళనలో భాగంగా ఇప్పటికే సెప్టెంబర్ 11న ఒకరోజు సమ్మె నిర్వహించింది. తమ డిమాండ్ల సాధన కోసం ఈ నెల చివరలో మరోసారి నిరసనకు సిద్ధమైంది. అంతేకాకుండా అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మెకు కూడా పిలుపునివ్వడంతో బ్యాంకింగ్ రంగంలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఎస్‌బీఐ ఈ ముందస్తు సలహాలు జారీ చేసింది.సమ్మె సమయంలో బ్రాంచ్‌లలో సిబ్బంది సహాయం అవసరమయ్యే పనులు, డాక్యుమెంట్ల పరిశీలన, కొన్ని రకాల చెక్కుల ప్రాసెసింగ్ వంటి సేవలకు ఆటంకం కలగవచ్చని బ్యాంకు స్పష్టం చేసింది. సమ్మెలో ఎంతమంది ఉద్యోగులు పాల్గొంటారనే దానిపై బ్రాంచ్‌ల పనితీరు ఆధారపడి ఉంటుందని తెలిపింది. అయితే, వినియోగదారులు ఇబ్బంది పడకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించుకోవాలని కోరింది.నగదు అవసరాల కోసం ఏటీఎంలు, ఆటోమేటెడ్ డిపాజిట్ అండ్ విత్‌డ్రాయల్ మెషీన్‌లు (ఏడీడబ్ల్యూఎం), అలాగే కస్టమర్ సర్వీస్ పాయింట్లు (సీఎస్‌పీ) అందుబాటులో ఉంటాయని ఎస్‌బీఐ పేర్కొంది. వీటితో పాటు ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, యోనో, యూపీఐ వంటి డిజిటల్ సేవలు యథాతథంగా పనిచేస్తాయని స్పష్టం చేసింది. నిధుల బదిలీ, ఆన్‌లైన్ చెల్లింపులు వంటి వాటిని ఈ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఎలాంటి ఆటంకం లేకుండా చేసుకోవచ్చని వివరించింది. అయితే, భౌతికంగా బ్రాంచ్‌కు వెళ్లాల్సిన పనులను మాత్రం ముందుగానే ప్లాన్ చేసుకోవడం ఉత్తమమని ఖాతాదారులకు సూచించింది.

# ఎల్‌నినోని సవాల్‌గా తీసుకుందాం

- మొదటి పేజి తరువాయి

ఇప్పటివరకు 79 శాతం భూముల్లోనే సాగు పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు నష్టపోకుండా ఉండేందుకు పంటల బీమా మొత్తాలు వారికి అందేలా చూడాలని, డిమాండ్ ఆధారిత పంటల సాగుపై దృష్టి సారించాలని చెప్పారు. వర్షాధార పంటలు, ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ, హైరిస్క్ జోన్‌లోని ఉద్యాన పంటలను కాపాడేందుకు రూ.190 కోట్లు కేటాయించామని, ఆ నిధులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఖరీఫ్ కంటింజెన్సీ ప్రణాళిక కోసం రూ.60 కోట్లు సిద్ధం చేశామని, 1.31 లక్షల క్వింటాళ్ల విత్తనాలను 80 శాతం సబ్సిడీతో రైతులకు సరఫరా చేశామని తెలిపారు. స్వయం సహాయక బృందాల ద్వారా కిచెన్ గార్డెన్‌లను ప్రోత్సహించి కూరగాయల ధరలను అదుపులో ఉంచవచ్చని అభిప్రాయపడ్డారు. పశువులకు తాగునీరు, పశుగ్రాసం కొరత లేకుండా చూడాలని ఆదేశించారు.గత ప్రభుత్వ వైఫల్యాలను ప్రస్తావిస్తూ, "2014-19 మధ్య మేము ఇరిగేషన్‌పై రూ.65 వేల కోట్లు ఖర్చు చేస్తే, 2019-24 మధ్య నాటి ప్రభుత్వం కేవలం రూ.22 వేల కోట్లే ఖర్చు చేసింది. ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే ఎల్ నినో వంటి విపత్తు వచ్చినా ఇబ్బందులు ఉండేవి కావు. మేము అధికారంలోకి వచ్చాక రూ.3,500 కోట్లతో 100 రోజుల్లో హంద్రీ-నీవా కాలువలకు నీరందించగలిగాం" అని చంద్రబాబు గుర్తుచేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, స్థానిక ఎన్నికలున్నా ప్రజాప్రతినిధులు గ్రామాల్లో పర్యటించి రైతులకు ధైర్యం చెప్పాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగం, రైతు, సాగునీటి సంఘాలు కలిసికట్టుగా పనిచేసి ఎల్ నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కోవాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

# విజయవాడలో వైసీపీ ధర్నాకు అనుమతి లేదు

డీఎస్సీ నియామక ప్రక్రియలో అక్రమాలు జరిగాయంటూ వైసీపీ సోమవారం విజయవాడలో చేపట్టతలపెట్టిన నిరసన కార్యక్రమాలకు పోలీసులు అనుమతి నిరాకరించారు. నగరంలో ప్రస్తుతం వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలు జరుగుతున్న నేపథ్యంలో శాంతిభద్రతల దృష్ట్యా ధర్నాలు, ర్యాలీలకు అనుమతి ఇవ్వలేమని ఎన్టీఆర్ జిల్లా పోలీసులు ఆదివారం స్పష్టం చేశారు.రాష్ట్రవ్యాప్త ఆందోళనల్లో భాగంగా, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో నిరసనలు చేపట్టేందుకు వైసీపీ అనుమతి కోరింది. అయితే, నగరంలో ఇప్పటికే భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 163, పోలీస్ యాక్ట్ సెక్షన్ 30 ప్రకారం నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నాయని పోలీసులు గుర్తుచేశారు. దీనికితోడు వినాయక నిమజ్జన ఊరేగింపుల వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగే అవకాశం ఉందని, బందోబస్తుకు సిబ్బంది కొరత కూడా ఉందని అనుమతి నిరాకరణకు గల కారణాలను వివరించారు.

ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) కృష్ణకాంత్ పటేల్ మాట్లాడుతూ, నగరంలో శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియమాలను పాటించి ప్రజలు, రాజకీయ పార్టీల నేతలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పోలీసుల ఆదేశాలను ఉల్లంఘించి నిరసనలు చేపడితే కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. వినాయక నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, సజావుగా సాగేలా చూడటమే తమ ప్రథమ కర్తవ్యమని ఆయన పేర్కొన్నారు.

## అమరావతి కోసం విశాఖను దెబ్బతీస్తున్నారు

అమరావతికి పెద్దపీట వేయడం కోసమే టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం విశాఖపట్నం అభివృద్ధిని ఉద్దేశపూర్వకంగా దెబ్బతీస్తోందని వైసీపీ నేత గుడివాడ అమర్నాథ్ ధ్వజమెత్తారు. స్థానిక సమస్యలను గాలికొదిలి, కేవలం ప్రతిపక్షంపై తప్పుడు ప్రచారం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ధ్వజమెత్తారు.విశాఖలో మీడియాతో మాట్లాడిన అమర్నాథ్, ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని వేదికలనూ వైసీపీని, పార్టీ నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకోవడానికే వాడుకుంటున్నారని విమర్శించారు. తన రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్ అయిన అమరావతిని ప్రమోట్ చేసుకోవడం కోసమే చంద్రబాబు విశాఖను చిన్నచూపు చూస్తున్నారని ఆరోపించారు. "నగరంలో తీవ్రమైన తాగునీటి ఎద్దడి నెలకొన్నా, కనీస దిద్దుబాటు చర్యలు చేపట్టలేదు. ఇది విశాఖ అభివృద్ధిని నిలిపివేయాలనే ఉద్దేశపూర్వక కుట్రలో భాగమే" అని ఆయన అన్నారు.

జగన్ 1.30 లక్షల ఇళ్ల పట్టాలు ఇస్తే, కూటమి ప్రభుత్వం ఆ పనులను నిలిపివేసిందని అమర్నాథ్ గుర్తుచేశారు. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇళ్ల పట్టాల పంపిణీ పేరుతో డ్రామా ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. విశాఖలో అత్యంత విలువైన భూములను తమకు కావాల్సిన వారికి, ముఖ్యంగా ఎక్కడినుంచో పుట్టుకొచ్చిన రియల్ ఎస్టేట్ కంపెనీలకు చౌకగా కట్టబెట్టారని తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ భూదోపిడీలో మంత్రి నారా లోకేశ్ తోడల్లుడు, స్థానిక ఎంపీ కూడా భాగస్వామిగా ఉన్నారని ఆరోపించారు.జలాశయాలన్నీ ఎండిపోయి, ప్రజలు తాగునీటి కోసం ఎదురుచూస్తుంటే, సీఎం చంద్రబాబు ఆ సమస్య గురించి మాట్లాడకుండా వైసీపీపై విమర్శలు చేయడం ఆయన చిత్తశుద్ధికి నిదర్శనమని వ్యంగ్యం ప్రదర్శించారు. చంద్రబాబు ఈవెంట్ మేనేజ్‌మెంట్‌తో ప్రజలు విసిగిపోయారని, ప్రధాన సమస్యలను పరిష్కరించకుండా జ్యోతిష్యాలు చెబుతూ కాలం గడుపుతున్నారని అమర్నాథ్ విమర్శించారు. పంచ ధారల జోన్‌లో అక్రమ మైనింగ్‌ను వైసీపీనే అడ్డుకుందని, భవిష్యత్తులో కూడా ప్రజల సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## ఆ కట్టడాన్ని.. సైనిక కాంప్లెక్స్‌గానూ తీర్చిదిద్దుతాం

- మొదటి పేజి తరువాయిు

ప్రకటన చేశారు. డ్రోన్లు, స్నైపర్‌లను మోహరించడంతోపాటు మందుగుండు సామగ్రిని సైతం నిల్వ చేసే సైనిక కాంప్లెక్స్‌గానూ ఈ కట్టడాన్ని తీర్చిదిద్దుతామని తెలిపారు.

"ప్రపంచంలోని 59 అగ్ర నగరాలు, రాజధానుల్లో.. ఒక్క వాషింగ్టన్ డీసీలోనే విజయ తోరణం లేదు. కానీ, ఇప్పుడు అన్నింటికన్నా గొప్ప కట్టడాన్ని నిర్మిస్తాం. సైన్యం అభ్యర్థన మేరకు, దేశ భద్రత ప్రయోజనాల దృష్ట్యా.. ప్రతిపాదిత 250 అడుగుల ఎత్తయిన ఈ నిర్మాణాన్ని అత్యున్నత శ్రేణి సైనిక సముదాయంగానూ మార్చేందుకు అంగీకరించాను. పెద్దసంఖ్యలో డ్రోన్లు, స్నైపర్‌లను మోహరించేందుకు, అదేవిధంగా మందుగుండు సామగ్రిని నిల్వ ఉంచేందుకు వీలుగా దీన్ని తీర్చిదిద్దుతాం" అని ట్రంప్ 'ట్రూత్ సోషల్' వేదికగా పోస్టు పెట్టారు.

**పశ్చిమాసియా ఉద్రిక్తతలు.. తమ పౌరులకు యూఎస్ అలర్ట్**

ఆర్లింగ్టన్ మెమోరియల్ బ్రిడ్జికి ఆనుకుని ఉన్న రిసెప్టివ్ సర్కిల్ వద్ద ఈ తోరణాన్ని నిర్మించేందుకు ప్రతిపాదించారు. వాషింగ్టన్ డీసీపై తన శాశ్వత ముద్ర వేసేందుకు ట్రంప్ చేపడుతున్న అనేక ప్రాజెక్టుల్లో ఇదీ ఒకటి. వైట్ హౌస్ బాల్‌రూమ్, లింకన్ మెమోరియల్ రిఫ్లెక్టింగ్ పూల్ పునరుద్ధరణ, ఈస్ట్ పొటోమాక్ పార్క్‌లో గోల్ఫ్ కోర్సు పునర్నిర్మాణం వంటివి ఇందులో ఉన్నాయి.

# కోర్టు ధిక్కరణ కేసులో ఎల్‌బీ నగర్ మాజీ ఏసీపీకి నెల రోజుల జైలు శిక్ష

- మొదటి పేజి తరువాయి

**అసలేం జరిగిందంటే..?**

వ్యాపారవేత్త కట్టా వంశీ కృష్ణపై సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో వరకట్న హత్య కేసు నమోదైంది. ఈ కేసులో నిందితుడిని అరెస్ట్ చేయకుండా రక్షణ కల్పిస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ అప్పటి ఎల్‌బీ నగర్ ఏసీపీ కృష్ణయ్య నిందితుడిని అరెస్ట్ చేశారు. కోర్టు ఆర్డర్స్ ఉన్నప్పటికీ తనను అరెస్ట్ చేయడాన్ని సవాల్ చేస్తూ వంశీ కృష్ణ హైకోర్టును ఆశ్రయించాడు. పోలీసులు తనను నిరంతరం వేధిస్తున్నారని, హైకోర్టు ఉత్తర్వుల గురించి చెప్పినప్పటికీ పోలీసులు పట్టించుకోలేదని, కేసు రికార్డులలో తనను పరారీలో ఉన్నట్లు తప్పుగా చూపించారని నిందితుడు పిటిషన్?లో పేర్కొన్నాడు. ఈ పిటిషన్?పై విచారణ చేపట్టిన హైకోర్టు జస్టిస్ కే.సుజన ఏసీపీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏసీపీ కోర్టు ఆదేశాలను బేఖాతరు చేసినట్లు నిర్ధారిస్తూ అతడికి నెలరోజుల పాటు కఠిన జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధించారు. నిందితుడిని అరెస్ట్ చేయకుండా మధ్యంతర ఉత్తర్వును పొడిగించిన విషయం ఏసీపీ కృష్ణయ్యకు తెలియదని, నేరం తీవ్రత దృష్ట్యానే ఆయన అలా వ్యవహరించారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదించారు.

ఏసీపీ కోర్టుకు బేషరతుగా క్షమాపణ కూడా చెప్పారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే, ఉత్తర్వును పొడిగించారో లేదో తనిఖీ చేయడం అధికారి బాధ్యత అని పేర్కొన్న న్యాయస్థానం.. ఏసీపీ వివరణ, క్షమాపణను తిరస్కరించింది. పీపీ అభ్యర్థన మేరకు ఏసీపీ అప్పీల్ దాఖలు చేసుకునేందుకు వీలుగా న్యాయమూర్తి ఆ ఉత్తర్వు అమలును నాలుగు వారాల పాటు నిలిపివేశారు.

## బెంగళూరులో 'ది ఎర్త్ సెంటర్' ప్రారంభోత్సవం.. హాజరైన సీఎం చంద్రబాబు

- మొదటి పేజి తరువాయి

కర్ణాటక సీఎం డీకే శివకుమార్ కూడా హాజరయ్యారు. ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ 'విస్టా స్పేసెస్' ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేసింది.ఈ భవనాన్ని సుమారు 9 లక్షల చదరపు అడుగుల భారీ విస్తీర్ణంలో, 2 బేస్‌మెంట్లు, గ్రౌండ్ ఫ్లోర్‌తో కలిపి మొత్తం 8 అంతస్తులతో నిర్మించారు. కేవలం కాంక్రీట్ భవనంలా కాకుండా, ఉద్యోగులు ప్రకృతితో మమేకమై పనిచేసే వాతావరణాన్ని కల్పించేలా 'బయోఫిలిక్ డిజైన్' శైలిలో దీన్ని రూపొందించడం ప్రధాన ఆకర్షణ. ఈ డిజైన్ ఉద్యోగుల మానసిక ఉల్లాసాన్ని, ఉత్పాదకతను పెంచడానికి దోహదపడుతుంది. వీవర్క్, ది ఎగ్జిక్యూటివ్ సెంటర్ వంటి ప్రముఖ ఫ్లెక్సిబుల్ వర్క్‌స్పేస్ ప్రొవైడర్లు ఇక్కడ తమ ప్రీమియం ఆఫీస్ సేవలను అందిస్తున్నాయి.వైట్‌ఫీల్డ్‌లోని కేఐఏడీబీ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ ఇండస్ట్రియల్ ఏరియాలో జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం, సీఎం చంద్రబాబు ఈ రాత్రికి బెంగళూరులోనే బస చేయనున్నారు. సోమవారం ఉదయం ఇక్కడి నుంచే నేరుగా తన సొంత నియోజకవర్గమైన కుప్పం పర్యటనకు ఆయన బయలుదేరి వెళతారు.

## టాటా సన్స్ చైర్మన్‌గా ఎన్. చంద్రశేఖరన్ పొడిగింపును సవాల్ చేసిన టాటా ట్రస్ట్స్

- మొదటి పేజి తరువాయి

మూడింట రెండు వంతుల వాటాను కలిగి ఉన్న స్వచ్ఛంద ట్రస్టుల నెట్‌వర్క్‌కు అధ్యక్షత వహిస్తున్న నోయల్ టాటా, చంద్రశేఖరన్ పదవీకాలాన్ని ఐదేళ్లు పొడిగించడానికి వ్యతిరేకంగా ఓటు వేశారు. టాటా సన్స్ బోర్డులో టాటా ట్రస్ట్స్ తరపున నామినేట్ అయిన మరో సభ్యుడు వేణు శ్రీనివాసన్ ఈ పొడిగింపును సమర్థించారు. బోర్డు సమావేశంలో ఎలాంటి ప్రతిష్టంభన లేదని, ట్రస్ట్ నామినేట్ చేసిన ఇద్దరు డైరెక్టర్లలో ఒకరు వ్యతిరేకంగా ఓటు వేయడంతో ఆ తీర్మానాన్ని చట్టబద్ధంగా ఆమోదించడం సాధ్యపడలేదని ట్రస్టులు ఒక ప్రకటనలో తెలిపాయి.టాటా సన్స్ బోర్డులో టాటా ట్రస్ట్స్ నామినీలుగా ఇద్దరు ఉన్నారు. ఇద్దరిలో మెజారిటీ అంటే ఇద్దరు, ఒకరు కాదని ట్రస్ట్స్ గుర్తుచేసింది. సెప్టెంబర్ 17, 2026న, అటువంటి డైరెక్టర్లలో ఒకరు తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేశారని, అందువల్ల, ఆశీూ (అంశాల ఆఫ్ అసోసియేషన్) ప్రకారం తప్పనిసరి అయిన టాటా ట్రస్ట్స్ నామినీ డైరెక్టర్ల మద్దతు చంద్రశేఖరన్?కు లభించలేదని టాటా ట్రస్ట్స్ వాదించింది. షరతు విఫలమైందని, దానితో పాటే తీర్మానం కూడా వీగిపోయిందని టాటా ట్రస్ట్స్ పేర్కొంది.

## విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌కు 'సర్' నోటీసులు

- మొదటి పేజి తరువాయి

తాజాగా విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌తోపాటు ఆయన భార్య క్యోకో జైశంకర్‌కు ఈసీ నోటీసులు జారీ చేసింది. 'అన్‌మ్యాప్‌డ్ విత్ లాస్ట్ ఎస్‌ఐఆర్' కింద ఈ నోటీసులు జారీ అయ్యాయి. వారి ప్రస్తుత వివరాలను ఎస్‌ఐఆర్-2002 వివరాలతో మ్యాపింగ్ చేయకపోవడంతోనే నోటీసులు జారీ చేసినట్లు ఈసీ వెల్లడించింది. జైశంకర్, ఆయన భార్యకు న్యూఢిల్లీ అసెంబ్లీ పరిధిలోని సుందర్‌బాగ్‌లో ఓటు హక్కు ఉంది.మరోవైపు సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్ భార్య షెబా బ్రిట్టాస్, కుమారుడు ఆనంద్‌కు కూడా 'సర్' నోటీసులు అందాయి. గత రికార్డులతో షెబా పేరు సరిపోలకపోవడంతో ఆమెకు, ఆనంద్‌కు నోటీసులు జారీ అయ్యాయి. ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, ఆయన భార్య సునీతా ద్వివేదికి కూడా 'అన్‌మ్యాప్‌డ్ విత్ లాస్ట్ ఎస్‌ఐఆర్' కింద నోటీసులిచ్చినట్లు తెలుస్తోంది.

## క్లాస్‌రూం నుంచే సమాజ మార్పు సాధ్యం

- మొదటి పేజి తరువాయి

విద్యాశాఖ, ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో 'భారతీయం' పేరుతో నిర్వహించిన ఈ దేశభక్తి కార్యక్రమానికి లోకేశ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "క్లాస్‌రూం నుంచే సమాజంలో మార్పు సాధ్యం. అందుకే నేను విద్యాశాఖను ఎంచుకున్నాను. దేశభక్తి, నైతిక విలువలే మన కుటుంబ వ్యవస్థకు పునాది" అని అన్నారు. త్యాగధనులే మనకు మార్గదర్శకులని, వారి బాటలో పయనించి ఉన్నతంగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. విలువలతో కూడిన విద్యను అభ్యసించి తల్లిదండ్రులకు, దేశానికి గర్వకారణంగా నిలవాలని లోకేశ్ మార్గనిర్దేశం చేశారు.

## ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనానికి ముహూర్తం ఖరారు

- మొదటి పేజి తరువాయి

దర్శనమిస్తుండడం తెలిసిందే. ప్రతి ఏటా 11 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలు, ఈసారి ఒక రోజు అదనంగా 12 రోజుల పాటు కొనసాగనుండటం విశేషం. దీంతో భక్తులకు స్వామి వారిని దర్శించుకునేందుకు అదనపు సమయం లభించనుంది.ప్రతి సంవత్సరం మాదిరిగానే, ఈసారి కూడా భారీ ఏర్పాట్ల మధ్య మహాగణపతిని హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. నిమజ్జనం తేదీ ఖరారు కావడంతో, భక్తులు మరియు నగర వాసులలో ఉత్సాహం నెలకొంది.

## వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోంది.. నమ్మొద్దు

మెగా డీఎస్సీ ద్వారా స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన తమ నియామకాలపై వైసీపీ ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తోందని పలువురు ఉపాధ్యాయులు తీవ్రంగా ఖండించారు. తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు విజయవాడలో సుమారు 370 మంది స్పోర్ట్స్ కోటా ఉపాధ్యాయులు ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి, తమ నిరసనను తెలియజేశారు.ఈ సమావేశంలో టీచర్లు "అబద్ధాలు వద్దు - ఆత్మగౌరవం ముద్దు" అంటూ నినాదాలు చేశారు. తాము ఎంతో కష్టపడి, క్రీడల్లో పతకాలు సాధించి మెరిట్ ఆధారంగానే ఉద్యోగాలు పొందామని స్పష్టం చేశారు. మెగా డీఎస్సీ ప్రక్రియను అప్రతిష్ఠపాలు చేసే ప్రయత్నాలను సహించబోమని హెచ్చరించారు. ఈ సందర్భంగా, స్పోర్ట్స్ కోటాను 3 శాతానికి పెంచి తమకు న్యాయం చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సమావేశంలో పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. "కొంతమంది కావాలనే మాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. వైసీపీ నేతలు అనుకునే గాంబ్లింగ్, పేకాట స్పోర్ట్స్ కోటాలో ఉండవు. బ్రిడ్జి గేమ్ గురించి తెలియక పేకాట అని తప్పుగా ప్రచారం చేస్తున్నారు. మాపైకి రాజకీయాలు నెట్టవద్దు. ఆటల్లో తగిలిన శారీరక గాయాల కన్నా, వారి మాటలు మమ్మల్ని మానసికంగా ఎక్కువ బాధిస్తున్నాయి" అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. "ఆరోపణలు చేస్తున్న ఛానళ్లు, నాయకులు కళ్లు తెరిచి మా సర్టిఫికెట్లు చూడాలి. ప్రతిభ ఉంటే ఒకే కుటుంబంలో ఇద్దరికి ఉద్యోగాలు రాకూడదా?" అని వారు ప్రశ్నించారు. వైసీపీ చేస్తున్న నిరాధార ఆరోపణలను ప్రజలు నమ్మవద్దని వారు విజ్ఞప్తి చేశారు.

# దళితుల పూజా హక్కులకు అడ్డంకులు వద్దు
# పోలేరమ్మ జాతరలో వివక్షకు తావివ్వొద్దు.. చర్యలు తీసుకోవాలి

**ప్రజా సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశంలో డిమాండ్**

**శ్రీకాళహస్తి రూరల్, పెన్ పవర్, సెప్టెంబర్ 20:**
తొట్టంబేడు మండలం చియ్యవరం గ్రామంలో నిర్వహించనున్న పోలేరమ్మ జాతరలో దళితులను పూజలు నిర్వహించకుండా ఆంక్షలు విధిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కుల వివక్షకు తావులేకుండా ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించాలని వారు కోరారు.
శ్రీకాళహస్తిలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఆదివారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ.. చియ్యవరం గ్రామంలో అనాదిగా కులమతాలకు అతీతంగా పోలేరమ్మ జాతర నిర్వహించుకుంటూ వస్తున్నారని తెలిపారు. అయితే గత కొంతకాలంగా కొందరు గ్రామ పెద్దలు దళితులను పూజా కార్యక్రమాలకు దూరంగా ఉంచుతున్నారని ఆరోపించారు.
2018లోనూ ఇదే తరహాలో దళితులను జాతరలో పూజలు చేయకుండా అడ్డుకునే ప్రయత్నం జరిగిందని, ప్రజా సంఘాల ఉద్యమం అనంతరం పూజలు నిర్వహించే అవకాశం కల్పించారని గుర్తు చేశారు. తాజాగా ఈ నెల 24న పోలేరమ్మ జాతర నిర్వహించేందుకు చాటింపు వేయడంతో పాటు దళితులు జాతర పనులు మాత్రమే చేయాలని, పూజలు నిర్వహించకూడదంటూ ఆంక్షలు విధించినట్లు ఆయన పేర్కొన్నారు.
ఈ అంశంపై ఆర్డీవోకు ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు, రెవెన్యూ అధికారులు గ్రామంలో నిర్వహించిన విచారణపై స్పష్టమైన చర్యలు తీసుకోలేదని ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి జాతరలో ప్రతి వర్గానికీ సమానంగా పూజలు నిర్వహించే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.
సోమవారం చియ్యవరం గ్రామంలో ప్రజా సంఘాల నాయకులు క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో మాల మహానాడు జిల్లా నాయకులు రాజేంద్ర, జైభీమ్ ఆర్మీ వ్యవస్థాపకులు పులి శ్రీకాంత్, యానాది సంఘం రాష్ట్ర అధ్యక్షులు చందమామల కోటయ్య, కెవిపిఎస్ నాయకులు గంధం మణి, పెనగడం గురవయ్య, మించల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.




# పెన్ పవర్
## రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి । చిత్తూరు । వై.ఎస్.ఆర్. కడప

# రేపు, ఎల్లుండి కుప్పంలో సీఎం చంద్రబాబు పర్యటన

**పెన్ పవర్, సెప్టెంబర్ 20:**
పర్యటన వివరాలు: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రేపు, ఎల్లుండి కుప్పంలో పర్యటించనున్నారు. అభివృద్ధి పనుల ప్రారంభం: ఈ పర్యటనలో భాగంగా రూ. 289.5 కోట్ల అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించనున్నారు.
శంకుస్థాపనలు: రూ. 38.5 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేయనున్నారు. సభ మరియు ముఖాముఖి: కొత్తపేటలో లబ్ధిదారులతో జరిగే ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని, అనంతరం బహిరంగ సభలో ఆయన ప్రసంగించనున్నారు.



# ఆపదలో అండగా నిలిచిన వంశీ యాదవ్ అత్యవసర సమయంలో రక్తదానం చేసి మానవత్వం చాటుకున్న స్వేచ్ఛ ఫౌండేషన్ అధ్యక్షులు




**ఏర్పేడు, పెన్ పవర్, సెప్టెంబర్ 20:**
ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ, సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండే స్వేచ్ఛ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు వంశీ యాదవ్ మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమని సమాచారం అందుకున్న వెంటనే స్పందించి రక్తదానం చేసి రోగి కుటుంబానికి అండగా నిలిచారు.
శ్రీ బాలాజీ హాస్పిటల్‌లో ఓ రోగికి శస్త్రచికిత్స నిమిత్తం అత్యవసరంగా రక్తం అవసరమని తెలియడంతో వంశీ యాదవ్ వెంటనే ఆసుపత్రికి చేరుకుని రక్తదానం చేశారు. ఆపద సమయంలో స్పందించి విలువైన రక్తాన్ని అందించడంతో రోగి కుటుంబ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వంశీ యాదవ్ మాట్లాడుతూ రక్తదానం ఒక సేవ మాత్రమే కాదని, ఆపదలో ఉన్న ఓ ప్రాణాన్ని కాపాడే గొప్ప మానవతా కార్యక్రమమని అన్నారు. అత్యవసర సమయాల్లో రక్తం అందుబాటులో లేక అనేక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. యువతలో సేవాభావాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ తమకు సాధ్యమైనవిధంగా సామాజిక సేవలో భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. మనం చేసే చిన్న సహాయం మరొకరి జీవితంలో ఎంతో పెద్ద మార్పును తీసుకురాగలదని పేర్కొన్నారు.
స్వేచ్ఛ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్న వంశీ యాదవ్, తాజాగా అత్యవసర సమయంలో రక్తదానం చేయడంపై స్థానికులు, అభిమానులు అభినందనలు తెలిపారు. ఆయన సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

# కవిత, జనసేన మధ్య సోషల్ మీడియా మాటల యుద్ధం



**పెన్ పవర్, సెప్టెంబర్ 20:**
మాటల యుద్ధం: ప్రస్తుత రాజకీయ పరిణామాల్లో భాగంగా, కల్వకుంట్ల కవిత నేతృత్వంలోని తెలంగాణ రక్షణ సమితికి మరియు జనసేన పార్టీ తెలంగాణ విభాగానికి మధ్య సోషల్ మీడియా వేదికగా మాటల యుద్ధం తారస్థాయికి చేరింది.
భూ ఆక్రమణ ఆరోపణలు: జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని వ్యంగ్యాస్త్రాలు సంధించిన తెలంగాణ రక్షణ సమితి, ఆయనకు సంబంధించిన భూమి చెరువు పరిధిలో ఉందంటూ తీవ్ర ఆరోపణలు గుప్పించింది.
ప్రతి దాడి: ఈ ఆరోపణలపై తీవ్రంగా స్పందించిన జనసేన శ్రేణులు, కవిత యొక్క ఆస్తుల వివరాలపై దృష్టి సారించాయి. ఆమె సంపాదించిన కోట్ల కొద్దీ ఆస్తులు ఎక్కడి నుండి వచ్చాయంటూ పలు ప్రశ్నలను సంధిస్తూ సోషల్ మీడియాలో గట్టిగా నిలదీస్తున్నాయి.

# మహానందిలో వైఎస్ఆర్ సీపీ శంఖారావం.. ఘనంగా విస్తృత స్థాయి సమావేశం

**శ్రీశైలం పెన్ పవర్ సెప్టెంబర్ 20**
మహానంది మండలంలోని కుమ్మరి సత్రంలో వైఎస్ఆర్ సీపీ విస్తృత స్థాయి సమావేశం ఘనంగా జరిగింది. శ్రీశైలం నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి నాయకులు,కార్యకర్తలు భారీగా తరలివచ్చారు.
రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కార్యాచరణ, గ్రామస్థాయిలో పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలపై పోరాటం వంటి అంశాలపై శిల్పా చక్రపాణి రెడ్డి నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.
కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలులో విఫలమైందని శిల్పా చక్రపాణి రెడ్డి విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.



ఈ సందర్భంగా వైఎస్ఆర్ సీపీ నాయకులు, కమిటీ సభ్యులకు ఐడీ కార్డులను పంపిణీ చేశారు. ప్రతి గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేసి, కార్యకర్తలను పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా భాగస్వామ్యం చేయాలని సూచించారు.



ఈ కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గ నాయకులు శిల్పా భువనేశ్వర్ రెడ్డి మరియు వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అక్టోబర్ నెలాఖరు వరకు కేసీ కెనాల్ ఆయకట్టుకు నీరు విడుదల చేయాలని మంత్రి ఎన్ఎండి ఫరూక్ కి గోస్పాడు మండలం యాలూరు రైతుల వినతి

**నంద్యాల పెన్ పవర్ సెప్టెంబర్ 20**
నంద్యాల మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ని గోస్పాడు మండలం యాలూరు గ్రామానికి చెందిన రైతులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు.
ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కేసీ కెనాల్ ఆయకట్టు కింద ముమ్మరంగా పంటల సాగు చేపట్టామని , ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల వల్ల తక్కువ కాలపరిమితి పంటలు (సుమారు 100 రోజులు) వేయడం జరిగిందని, ఇవి అక్టోబర్ మొదటి వారం (రబీ) నుంచి సాగు దశకు వస్తాయని తెలిపారు. ఈ పంటలకు మరో 2 తడుల నీరు అందితే చేతికి అందుతాయని వివరించారు. ప్రధానంగా మినుము, జొన్న పంటలు సాగు చేశామని, ముఖ్యంగా జొన్న పంట పశుగ్రాసానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మంత్రి ఫరూక్ దృష్టికి తీసుకొచ్చారు. కావున ప్రస్తుత ఖరీఫ్ పంటలు పూర్తిగా చేతికి వచ్చేందుకు అక్టోబర్ నెలాఖరు వరకు కేసీ కెనాల్ ద్వారా సాగునీటిని నిరంతరాయంగా కొనసాగించేలా సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు ఇవ్వాలని రైతులు విజ్ఞప్తి చేశారు.
రైతుల సమస్యలను సావధానంగా విన్న మంత్రి ఎన్ఎండి ఫరూక్ సానుకూలంగా స్పందిస్తూ ఎలినో ప్రభావం వల్ల నీటి ఇబ్బంది చాలా ఉందని , నీటిపారుదల శాఖ (ఇరిగేషన్) అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు .
ఈ కార్యక్రమంలో గోస్పాడు మండలం యాలూరు గ్రామానికి చెందిన ఆయకట్టు రైతులు, తదితరులు పాల్గొన్నారు.



# ఆత్మకూరు మున్సిపల్ చైర్మన్ పీఠం ఎస్సీలకే అవకాశం కల్పించాలి రాష్ట్రమాల మహానాడు డిమాండ్

ఆత్మకూర్ పెన్ పవర్ సెప్టెంబర్ 20
నంద్యాల జిల్లా ఆత్మకూరు రాష్ట్రశీలో త్వరలో జరగబోయే పురపాలక సంఘం, నగర పంచాయతీ,మున్సిపల్ఎన్నికలు, జరిపించేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది ఈ నేపథ్యంలోనే నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గం ఆత్మకూరు మున్సిపాలిటీ చైర్మన్ పీఠం ఎస్సీలకే కూటమి పాలకులు అవకాశం కల్పించే విధంగా చొరవ తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షులు పెరుమాళ్ళ చెన్నకేశవులు మాల మహానాడు జిల్లా అధ్యక్షులు మురహరి మల్లయ్య ఆత్మకూరు తాలూకా మాల మహానాడు సీనియర్ నాయకులు ప్రాతకోట రమేష్ ఆత్మకూరు తాలూకా ఉపాధ్యక్షులు సీనియర్ పాత్రికేయులు సగినేల రవికుమార్, కెవిపిఎస్ జిల్లా నాయకులు నక్క సంపత్,నేరేడు స్వాములు, గుంపుల నాగన్న లు పేర్కొన్నారు, ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ స్ఫూర్తి కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ ఆత్మకూరు పురపాలక సంఘంలో ఇప్పటివరకు ఎస్సీలకు ఏ పాలకులు కూడా చైర్మన్ గా అవకాశం కల్పించలేదు వీటితోపాటు పట్టణంలో 32 వార్డులలో ఎస్సీలకే అధిక సీట్ల ప్రాధాన్యత కల్పించి కూటమిపాలనలోనైనా రిజర్వేషన్ ప్రకారంగా ఎస్సీలకే చైర్మన్ పీఠం కేటాయించాలని మాల మహానాడు కమిటీ నాయకులు డిమాండ్ చేశారు ఇదివరకే ఓసి బిసి మైనార్టీ వారు చైర్మన్ పీఠం ఇదివరకు కేటాయించారు ఆత్మకూరు మేజర్ గ్రామపంచాయతీ ఏర్పడినప్పటి నుండి ఇంతవరకు ఎస్సీలకు సర్పంచ్ గాని చైర్మన్గా గాని అవకాశాలు కల్పించలేదు 2024 అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం గెలుపు కోసం మాల మహానాడు ఎంతో కృషి చేసింది రాజకీయంగా అప్పుడు ఇచ్చిన మాట ప్రకారం గా ఎస్సీలకు రాజకీయంగా అవకాశాలు కల్పిస్తామని కూటమి ప్రభుత్వ నేతలు హామీ ఇచ్చారు ఇచ్చిన మాట ప్రకారంగానే ఆత్మకూరు మున్సిపాలిటీలో చైర్మన్ పీఠం ఎస్సీలకే కేటాయించాలని మాలమహానాడు నాయకులు పత్రికా ముఖంగా తెలియజేశారు
కొత్తపల్లి మండలంలో ఎంపీపీ జడ్పిటిసి స్థానాలను ఎస్సీలకే కేటాయించాలినందికొట్కూరు నియోజకవర్గం లోని కొత్తపల్లి మండలంలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థ ఎన్నికలలో సర్పంచి స్థానాలను పెంచుతూ జడ్పిటిసి ఎంపీపీ స్థానాలను ఎస్సీలకే కేటాయించాలని మాల మహానాడు తాలూకా సీనియర్ నాయకులు ప్రాతకోట రమేష్ కెవిపిఎస్ జిల్లా నాయకులు నక్క సంపత్ లు డిమాండ్ చేశారు



# ప్రధమనంది బ్రిడ్జి వద్ద కుంగిన రోడ్డును క్షేత్రస్థాయిలో పరిశీలించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 20**
నంద్యాల పట్టణంలో ఈరోజు కురిసిన భారీ వర్షాల కారణంగా ప్రధమనందికి వెళ్లే బ్రిడ్జిని అనుకుని ఉన్న రోడ్డు ఒకవైపు కోతకు గురై కూలిపోయింది. ఈ విషయం దృష్టికి వచ్చిన వెంటనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ తక్షణమే స్పందించి ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని స్వయంగా పరిశీలించారు.
ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ దెబ్బతిన్న రోడ్డు భాగాన్ని పరిశీలించి, అధికారులతో మాట్లాడారు. భారీ వర్షాలతో నీటి ప్రవాహం పెరిగి రోడ్డు మార్జిన్ కోతకు గురైందని గుర్తించిన ఆయన, వాహనదారులకు మరియు ప్రజలకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.
ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణమే యుద్ధప్రాతిపదికన తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని, అనంతరం పటిష్టమైన శాశ్వత రక్షణ గోడ నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత శాఖ ఇంజనీరింగ్ అధికారులను మంత్రి ఆదేశించారు. వర్షాల దృష్ట్యా ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, ప్రయాణాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.
ఈ కార్యక్రమంలో ప్రధమనంది దేవస్థానం చైర్మన్ చలం బాబు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# రైల్వే బోర్డు సభ్యులు ఏవీ రంగయ్య నివాసంలో ఆత్మీయ విందు పాల్గొన్న మంత్రి ఎన్ఎండి ఫరూక్, మిద్దె శివరామ్, ఎన్ఎండి ఫిరోజ్



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 20**
రైల్వే బోర్డు సభ్యులు, నంద్యాల మాజీ బలిజ సంఘం అధ్యక్షులు ఏవీ రంగయ్య స్థానిక ఎస్బీఐ కాలనీలోని సాయి అపార్ట్‌మెంట్స్‌లో గల ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ విందు కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, ఆర్జీయం విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ మిద్దె శివరామ్, తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏవీ రంగయ్య ముఖ్య అతిధులకు మరియు ఇతర ప్రముఖులకు సాదర స్వాగతం పలికారు. విందు అనంతరం ముఖ్య అతిథులను రంగయ్య మరియు వారి కుటుంబ సభ్యులు ఘనంగా సన్మానించారు . ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, పలువురు ముఖ్య నాయకులు, సన్నిహితులు తదితరులు పాల్గొన్నారు.

# 25వ తేదీ నుంచి నంద్యాల జిల్లా పరిషత్‌కు ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి

**ప్రస్తుత జిల్లా పరిషత్ పాలకవర్గం పదవీకాలం 24వ తేదీతో ముగింపు**
**ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లా పరిషత్ పరిపాలనా బాధ్యతలు స్వీకరించనున్న కలెక్టర్**

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 20:-**
ప్రస్తుత జిల్లా పరిషత్ పాలకవర్గాల పదవీకాలం సెప్టెంబర్ 24, 2026తో ముగియనున్న నేపథ్యంలో, సెప్టెంబర్ 25వ తేదీ నుంచి జిల్లా పరిషత్‌ల పరిపాలనను కొనసాగించేందుకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. ఈ మేరకు పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి (ఎన్నికలు–నియమాలు) శాఖ జి .ఒ . ఎమ్మెస్ . నెంబర్.129, తేదీ: 19 వ తేదీ సెప్టెంబర్ 2026 జారీ చేసింది.
ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం, 1994లోని సెక్షన్ 250–ఎ (1) కింద, నంద్యాల జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ జి. రాజకుమారిని నంద్యాల జిల్లా పరిషత్‌కు ప్రత్యేక అధికారిగా (స్పెషల్ ఆఫీసర్ ) నియమించింది. ఈ నియామకం సెప్టెంబర్ 25, 2026 నుంచి ఆరు నెలల కాలానికి లేదా ఎన్నికైన జిల్లా పరిషత్ సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్ తదితర పదవీ బాధ్యతలు స్వీకరించే తేదీ వరకు అమల్లో ఉంటుంది.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు జిల్లా పరిషత్‌కు సంబంధించిన పరిపాలనా వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, ప్రజలకు అందాల్సిన సేవలు, అభివృద్ధి కార్యక్రమాలు ఎటువంటి అంతరాయం లేకుండా కొనసాగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా పరిషత్ పరిధిలోని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో శాఖల మధ్య సమన్వయంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు.
మండల పరిషత్‌ల విషయానికి వస్తే, ప్రస్తుత మండల పరిషత్ పాలకవర్గాల పదవీకాలం కూడా సెప్టెంబర్ 24తో ముగియనున్న నేపథ్యంలో, సెప్టెంబర్ 25 నుంచి సంబంధిత మండల పరిషత్‌ల పరిపాలన కొనసాగింపునకు ప్రభుత్వం జారీ చేసే తదుపరి ఉత్తర్వుల మేరకు ప్రత్యేక అధికారుల ద్వారా పరిపాలన కొనసాగనుంది.



# ట్రాన్స్ ఫార్మర్ చోరీ ప్రయత్నంలో కాలి మృతి చెందిన తండ్రి, కొడుకు



**గూడూరు: పెన్ పవర్, సెప్టెంబర్ 20**

నెల్లూరు జిల్లా, గూడూరు రూరల్ మండల పరిధిలోని రామలింగాపురం గ్రామంలో శనివారం రాత్రి తండ్రి, కొడుకు ఇద్దరూ కలిసి ట్రాన్స్ ఫార్మర్ లోని రాగి వైరను చోరీ చేసే ప్రయత్నంలో విద్యుత్ ప్రమాదానికి గురై తండ్రి, కొడుకు లిద్దరూ కాలి మృతి చెందిన సంఘటన సంచలనంగా మారింది. ఈ ప్రమాద సంఘటనపై సమాచారం అందుకున్న గూడూరు రూరల్ పోలీసులు ఆదివారం ప్రమాద స్థలాన్ని పరిశీలించి చనిపోయిన వారి వివరాలను సేకరించారు. గూడూరు మండలం, చెన్నూరు గ్రామానికి చెందిన వారుగా గుర్తించారు. మృతదేహాలను ఏరియా ఆసుపత్రికి తరలించి, ప్రమాద సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు సమాచారం. ఏది ఏమైన ఓ తండ్రి కన్న కొడుకునే అక్రమ సంపాదనకు, దొంగతనానికి తీసుకువెళ్లి కుమారున్ని కూడా తనతో పాటే మరణంలో కూడా వెంటబెట్టుకొని వెళ్లిన సంఘటన చర్చనీ అంశమైంది. ఈ రోజుల్లో ఎన్నో ఉపాధి పనుల ద్వారా డబ్బులు సంపాదిస్తుంటే దొంగతనం చేసి డబ్బు సంపాదించాలనే ప్రయత్నంలో సరాసరి వారి ప్రాణాలనే బలి తీసుకున్నారు. కుటుంబ యజమాని, కుమారుడు చనిపోవడంతో ఆ కుటుంబంలో ఎవరూ తీర్చలేని విషాదఛాయలు అలుముకున్నాయి.

# అన్నదానానికి రూ.1,00,116 విరాళం



**శ్రీకాళహస్తీశ్వరస్వామి నిత్య అన్నదానానికి ఒంగోలు సీతారామయ్య కుటుంబం సేవా సహకారం**

**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 20:**

అన్నదానం మహాదానం.. ఆధ్యాత్మిక సేవలో భాగస్వామ్యం కావడం భక్తులకు ఎంతో సంతృప్తినిచ్చే విషయమని పలువురు పేర్కొన్నారు. శ్రీకాళహస్తీశ్వరస్వామివారి దేవస్థానంలో కొనసాగుతున్న నిత్య అన్నదాన కార్యక్రమానికి ఒంగోలుకు చెందిన సీతారామయ్య కుటుంబ సభ్యులు రూ.1,00,116/- విరాళాన్ని సమర్పించారు.

ఈ విరాళాన్ని దేవస్థానం చైర్మన్ కొట్టే సాయిప్రసాద్, సభ్యులు కుసుమకుమారిలకు అందజేశారు. ఈ సందర్భంగా దాతల సేవాభావాన్ని అభినందిస్తూ, నిత్య అన్నదాన కార్యక్రమానికి సహకరిస్తున్న భక్తులు, దాతలకు దేవస్థానం తరపున కృతజ్ఞతలు తెలిపారు.

భక్తులకు అన్నప్రసాదాన్ని అందించే పవిత్ర కార్యక్రమానికి దాతల సహకారం మరింత బలాన్నిస్తుందని పేర్కొన్నారు. "అన్నం పెట్టే చేతులు.. ఆశీస్సులు అందుకునే హృదయాలు" అన్న భావనకు ఈ సేవా కార్యక్రమం ప్రతీకగా నిలుస్తోందని తెలిపారు.

# మాతమ్మ ఆలయ కుంభాభిషేకంలో పాల్గొన్న జయచంద్ర నాయుడు

## భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించిన కుంభాభిషేక మహోత్సవం

**తొట్టంబేడు: పెన్ పవర్, సెప్టెంబర్ 20**

మండలంలోని తొట్టంబేడు గ్రామం బీడి కాలనీ వద్ద నూతనంగా నిర్మించిన మాతమ్మ ఆలయ కుంభాభిషేక మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వాడపల్లి జయచంద్ర నాయుడు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి కృషి చేసిన నిర్వాహకులను అభినందిస్తూ, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో సుధాకర్ యాదవ్, ఉమాపతి, నాగభూషణం తదితరులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఆలయ



కుంభాభిషేకాన్ని పురస్కరించుకుని బీడి కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# కర్ణాటక ఎమ్మెల్సీ సీటీ రవిని మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి






**శ్రీకాళహస్తి , పెన్ పవర్, సెప్టెంబర్ 20:**

కర్ణాటక ఎమ్మెల్సీ సీటీ రవిని ఆయన నివాసంలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్త బాలాజీ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీటీ రవితో వారు ఆత్మీయంగా ముచ్చటించారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలు, ప్రజా సమస్యలు, ఇరు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు తదితర అంశాలపై స్నేహపూర్వకంగా చర్చించినట్లు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా పరస్పర గౌరవం, ఆత్మీయతతో సాగిన ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది.

# విజ్ఞానగిరి సన్నిధిలో వైభవంగా భరతనాట్య ప్రదర్శనఆశ నాట్య అకాడమీ ఆధ్వర్యంలో ఏడో రోజు వినాయక ఉత్సవాలు ఘనంగా









**శ్రీకాళహస్తి: పెన్ పవర్, సెప్టెంబర్ 20**

విజ్ఞానగిరి కొండ కింద వెలసిన విజయ గణపతి స్వామివారి సన్నిధిలో ఆశ నాట్య అకాడమీ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అకాడమీ విద్యార్థినులు సంప్రదాయ భరతనాట్య ప్రదర్శనతో అలరించారు.

భక్తి, కళా సంప్రదాయాలను మేళవిస్తూ విద్యార్థినులు ప్రదర్శించిన భరతనాట్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. నృత్యంలోని హావభావాలు, లయబద్ధమైన అడుగులు, సంప్రదాయ వస్త్రధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

విజయ గణపతి స్వామివారి సన్నిధిలో జరిగిన ఈ కళా ప్రదర్శన ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత శోభాయమానం చేసింది. భారతీయ సంస్కృతి, సంప్రదాయ కళలను చిన్నారుల్లో పెంపొందించడంలో ఆశ నాట్య అకాడమీ చేస్తున్న కృషిని పలువురు అభినందించారు.

# కొడవలూరు మండలం వైసీపీ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి నల్లపరెడ్డి.

**వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, సర్వేపల్లి నియోజకవర్గ పరిశీలకులు వీరి చలపతిరావు ఆధ్వర్యంలో వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ కొడవలూరు మండలం విస్తృత స్థాయి సమావేశం మండల పార్టీ కార్యాలయంలో నిర్వహించారు.**

**ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రివర్యులు, వైసీపీ రాష్ట్ర పాక్ సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి పాల్గొన్నారు**

**కోవూరు పెన్ పవర్ సెప్టెంబర్ 20.**

ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి వార్డులో సమర్థులైన అభ్యర్థులను ఎంపిక చేసి, వారి విజయానికి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు.

పార్టీ కార్యకర్తలకు ఐడీ కార్డుల పంపిణీ చేపట్టనున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వానికి భయపడకుండా కార్యకర్తలంతా ఐక్యంగా పనిచేయాలని, ప్రతి వార్డులో పార్టీ అభ్యర్థుల విజయానికి అవసరమైన సహాయ



సహకారాలను పార్టీ తరపున అందిస్తామని భరోసా ఇచ్చారు.

2029లో వై.యస్. జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవడమే తమ లక్ష్యమని, వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు కొండూరు అనిల్ బాబు, అప్లడా చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్, కొడవలూరు మండల పార్టీ అధ్యక్షులు



చిమటా శేషగిరి, ఎంపీపీ జ్యోతి, ఇందుకూరుపేట మండల పార్టీ అధ్యక్షులు మవులూరు శ్రీనివాసులు రెడ్డి, బుచ్చి రూరల్ పార్టీ అధ్యక్షులు చెర్లో సతీష్ రెడ్డి, విడవలూరు మండల పార్టీ అధ్యక్షులు కాటంరెడ్డి నవీన్ రెడ్డితో పాటు మండల ముఖ్య నాయకులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, పార్టీ కమిటీ సభ్యులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# నెల్లూరు నగర కార్పొరేషన్ టీడీపీ మేయర్ రేసులో కోడూరు కమలాకర్ రెడ్డి

**వేగవంతంగా కదులుతున్న పావులు**
**వేమిరెడ్డి దంపతులకు, సోమిరెడ్డి, బీదా రవిచంద్ర, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి అత్యంత సన్నిహితులు**
**నెల్లూరు కార్పొరేషన్ ఓసి జనరల్ కు రిజర్వ్ అయ్యే అవకాశం**
**మూడు డివిజన్లను ప్రభావితం చేసే నాయకుడు కావడంతో అందరి ఆమోద ముద్ర పడే అవకాశం**

**నెల్లూరు పెన్ పవర్ సెప్టెంబర్ 20.**

కార్పొరేషన్ అభ్యర్థులకు కూడా అన్ని విధాలుగా సహాయ సహకారాలు

నెల్లూరు నగర కార్పొరేషన్ టీడీపీ మేయర్ అభ్యర్థికి సంబంధించి ప్రధాన రేసులో కోడూరు కమలాకర్ రెడ్డి ముందు వరుసలో ఉన్నారు. ఈ మేరకు అత్యంత విశ్వశనీయ వర్గాలు వెల్లడించాయి. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షుడు బేధా రవిచంద్ర, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి



కోడూరు కమలాకర్ రెడ్డికి అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. సుదీర్ఘకాలం వారితో కలిసి ప్రయాణం సాగించాడు.

నెల్లూరు నగర కార్పొరేషన్ కు మరో నెలలో నోటిఫికేషన్ వస్తున్న నేపథ్యంలో ఈసారి కార్పొరేషన్ ను ఓసి జనరల్ గా రిజర్వ్ చేసే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అందరికీ ఆమోదయోగమైన పేరును ముఖ్య నేతలు పరిశీలిస్తున్నారు. అనేక పేర్లు వినిపిస్తున్న ప్రధాన నాయకులకు అత్యంత సన్నిహితంగా ఉన్న కోడూరు కమలాకర్ రెడ్డి పేరు అనూహ్యంగా మేయర్ అభ్యర్థిగా ముందుకు వచ్చింది. ఆయనను మేయర్ అభ్యర్థిగా ముందు వరుసలో నిలబెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆ దిశగా అందరి మద్దతు కూడా కూడగడుతున్నారు. అందరి ఆశీస్సులు కూడా అందుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. కోడూరు పాడు గ్రామం తో పాటు నెల్లూరు రూరల్ పరిధిలోని మూడు డివిజన్ లలో గెలుపోతములను ప్రభావితం చేసే స్థాయిలో కోడూరు కమలాకర్ రెడ్డి తనకంటూ ఓ వర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఇక పుష్కలంగా ఆర్థిక వనరులు కూడా ఉండటంతో మేయర్ అభ్యర్థిగా ఆయన అందరి ఆమోదంతో టిడిపి తరపున బరిలోకి దిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. తెలుగుదేశం పార్టీ అధిష్టానం ఆమోదమే ఇక తరువాయి. కార్పొరేషన్ లో బరిలో దిగే అభ్యర్థులకు కూడా ఆయన ఆర్థికంగా తో పాటు అన్ని విధాలుగా తన వంతు సహకారం అందించే అవకాశాలు ఉన్నాయి.

# గ్రామీణ ఉపాధి కల్పనలో కోదాడ మెగా జాబ్ మేళా మైలురాయి

**350 కంపెనీలను ఒకే వేదికపైకి తీసుకొచ్చిన మంత్రి ఉత్తమ్**
**30 వేలకుపైగా రిజిస్ట్రేషన్లు.. 5,725 మంది అభ్యర్థుల షార్ట్‌లిస్ట్**
**-స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్**

**పెన్ పవర్ సెప్టెంబర్ 20.**

సెప్టెంబర్ 20: విద్యావంతులైన గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలను చేరువ చేయాలన్న లక్ష్యంతో నిర్వహించిన కోదాడ మెగా జాబ్ మేళా విజయవంతమైంది. రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చొరవతో సుమారు 350 కంపెనీలు ఒకే వేదికపైకి రాగా, 30 వేల మందికిపైగా ఉద్యోగార్థులు నమోదు చేసుకున్నారు. వివిధ దశల్లో నిర్వహించిన ఇంటర్వ్యూల అనంతరం 5,725 మంది అభ్యర్థులు తదుపరి నియామక ప్రక్రియకు షార్ట్‌లిస్ట్ అయ్యారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఎన్. పద్మావతిరెడ్డి నేతృత్వంలో సెప్టెంబర్ 19న నిర్వహించిన ఈ భారీ నియామక కార్యక్రమం గ్రామీణ నిరుద్యోగ సమస్యను ప్రధానాంశంగా తీసుకుంది. భౌగోళిక దూరం, ఉద్యోగ సమాచార లోపం, ఆర్థిక పరిమితుల కారణంగా ప్రముఖ సంస్థలను చేరుకోలేకపోతున్న గ్రామీణ యువతకు స్థానికంగానే అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో ఈ మేళాను నిర్వహించారు. సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి భువనగిరి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన యువత ఈ మేళాలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సమాచార సాంకేతికత, ఫార్మా, తయారీ, వైద్య ఆరోగ్య రంగం, బ్యాంకింగ్, రిటైల్‌తోపాటు వివిధ రంగాలకు చెందిన సంస్థలు అభ్యర్థుల విద్యార్హతలు, నైపుణ్యాలను పరిశీలించి ప్రత్యక్ష ఇంటర్వ్యూలు నిర్వహించాయి. గ్రామీణ కుటుంబాలు ఎన్నో త్యాగాలు చేసి తమ పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నప్పటికీ, వారికి సరైన సమయంలో ఉద్యోగ సమాచారం అందడం లేదని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఇంజినీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్, పాలిటెక్నిక్



తదితర కోర్సులు పూర్తి చేసిన యువత ఉద్యోగ అవకాశాలను గుర్తించడం, సంస్థలను సంప్రదించడం, ఇంటర్వ్యూల కోసం పదేపదే నగరాలకు వెళ్లడం వంటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వివరించారు. ఒక యువకుడి గ్రామ చిరునామా లేదా కుటుంబ ఆర్థిక పరిస్థితి అతని ఉద్యోగ అవకాశాలకు అడ్డంకిగా మారకూడదన్నదే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు.

అర్హులైన ఉద్యోగుల కోసం ఎదురుచూస్తున్న కంపెనీలు, తొలి అవకాశం కోసం నిరీక్షిస్తున్న గ్రామీణ యువతను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా వారి మధ్య ఉన్న అంతరాన్ని ఈ మేళా తగ్గించిందన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హతలు, నైపుణ్యాలను నేరుగా సంస్థల ప్రతినిధుల ముందు ప్రదర్శించడంతోపాటు సంఘటిత రంగంలో ఉద్యోగాలు పొందేందుకు అవసరమైన అర్హతలు, నైపుణ్యాలపై అవగాహన పొందారని తెలిపారు.

గత ఏడాది హుజూర్‌నగర్‌లో నిర్వహించిన జాబ్ మేళా అనుభవానికి కొనసాగింపుగా కోదాడలో ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృత స్థాయిలో చేపట్టారు. పారిశ్రామికవేత్తలు, విద్యాసంస్థలు, ఐదు జిల్లాల అధికార యంత్రాంగంతో ముందస్తుగా సమన్వయం చేసుకుని యువతను పెద్ద ఎత్తున సమీకరించారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఈ కార్యక్రమానికి సహకారం అందించాయి. జాబ్ మేళాలో పాల్గొన్న యువతను ఉద్దేశించి శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ, గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలను చేరువ చేయడంలో కోదాడ మెగా జాబ్ మేళా రాష్ట్రంలో ఒక మైలురాయిగా నిలుస్తుందని ప్రశంసించారు. ఒకే వేదికపైకి సుమారు 350 కంపెనీలను తీసుకురావడం అసాధారణమైన ప్రయత్నమన్నారు.రాష్ట్రవ్యాప్తంగా ఇటువంటి భారీ ఉద్యోగ మేళాలను నిర్వహించి యువత నివసిస్తున్న ప్రాంతాలకు చేరువలోనే ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు.

శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఐటీపరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రోడ్లుభవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తదితరులు జాబ్ మేళాలో పాల్గొన్నారు. కంపెనీల ప్రతినిధులు, ఉద్యోగార్థులతో వారు మాట్లాడి, ఉద్యోగ అవకాశాలు పొందిన అభ్యర్థులను అభినందించారు. ఐదు జిల్లాల్లోని గ్రామీణ, పట్టణ శివారు ప్రాంతాలకు చెందిన విద్యావంతులైన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను చేరువ చేయడంతోపాటు పరిశ్రమలుఉద్యోగార్థుల మధ్య ప్రత్యక్ష అనుసంధానానికి కోదాడ మెగా జాబ్ మేళా బలమైన వేదికగా నిలిచింది. అర్హత, ప్రతిభ ఉన్నప్పటికీ సరైన అవకాశం కోసం ఎదురుచూస్తున్న యువతకు కొత్త ఆశలు కల్పిస్తూ గ్రామీణ ఉపాధి కల్పనలో సరికొత్త అధ్యాయానికి నాంది పలికింది.

# ఇందిరమ్మ ఇండ్లు అలాట్‌మెంట్ లెటర్లు నేడే రాయదుర్గంలో ఇందిరమ్మ ఇండ్లు టవర్స్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శంకుస్థాపన

**పెన్ పవర్ సెప్టెంబర్ 20.**

సెప్టెంబర్ 20 : అన్ని ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ ప్రాజెక్టుల కింద ఎంపికైన లబ్ధిదారులకు సంబంధించిన అలాట్‌మెంట్ లెటర్లు సోమవారం నుండి జారీ చేయబడతాయని

తెలంగాణ హౌసింగ్ బోర్డు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఎంపికైన లబ్ధిదారుల రిజిస్టర్డ్ మొబైల్ నంబర్లకు ఎస్ఎంఎస్

వాట్సాప్ ద్వారా అలాట్‌మెంట్ లెటర్లు నేరుగా పంపించబడతాయని తెలిపింది. అదేవిధంగా, లబ్ధిదారులు తమ అలాట్‌మెంట్ లెటర్లను పొందేందుకు తెలంగాణ హౌసింగ్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లో కూడా అందుబాటులో ఉంచబడతాయని పేర్కొంది.

ఎంపికైన లబ్ధిదారులు తమ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్లతో పాటు టీజీఎచ్బీ వెబ్‌సైట్‌ను కూడా పరిశీలించవలసిందిగా సూచించింది. సోమవారం శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలోని రాయదుర్గంలో ఇందిరమ్మ ఇండ్లు టవర్స్‌కు గౌరవ రెవెన్యూ, గృహ నిర్మాణ మరియు సమాచార పౌర



సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు.

రాయదుర్గంలో మల్కం చెరువు వెనుక భాగంలో ఉన్న సుమారు 2.85 ఎకరాల ప్రభుత్వ/తెలంగాణ హౌసింగ్ బోర్డు భూమిలో, ఒక్కొక్కటి సుమారు 528 చ.అ. విస్తీర్ణంతో 480 ఫ్లాట్లు నిర్మించడానికి ప్రతిపాదించబడిందని బోర్డు తెలిపింది. ప్రతి అర్హత కలిగిన లబ్ధిదారు కేవలం రూ.6.00 లక్షలు మాత్రమే చెల్లించాల్సి ఉండగా, ప్రభుత్వం ఒక్కో ఫ్లాట్‌కు రూ.5.00 లక్షల సబ్సిడీ అందించడంతో పాటు భూమి మొత్తం వ్యయాన్ని కూడా భరిస్తోందని తెల్పింది.

ఇందిరమ్మ ఇండ్లు ప్రాజెక్టు కోసం వినియోగిస్తున్న 2.85 ఎకరాల భూమి విలువ సుమారు రూ.752 కోట్ల నుంచి రూ.767 కోట్ల వరకు ఉంటుందని తెల్పింది. ప్రధాన ప్రాంతంలో, సాధారణ మార్కెట్‌లో సమానమైన ఫ్లాట్ విలువ సుమారు రూ.50 లక్షలు ఉండే పరిస్థితిలో కూడా, ప్రభుత్వం అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారునికి కేవలం రూ.6.00 లక్షల లబ్ధిదారు వాటాతో, అదనంగా రూ.5.00 లక్షల ప్రభుత్వ సబ్సిడీ మరియు ఉచిత భూమితో ఇందిరమ్మ ఇండ్లు ఫ్లాట్‌ను అందిస్తోంది. తద్వారా ప్రధాన ఉపాధి కేంద్రాలు మరియు నగర మౌలిక సదుపాయాలకు సమీపంలో సామాన్య ప్రజలకు అందుబాటు ధరలో గృహ సదుపాయంకల్పిస్తోంది.రాయదుర్గంలోనిర్వహించనున్న ఈ కార్యక్రమానికి తెలంగాణ హౌసింగ్ బోర్డు అధికారులు అన్ని అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన సంబంధిత అలాటీలు తమ కుటుంబ సభ్యులతో కలిసి మధ్యాహ్నం 3.30 గంటలకు కార్యక్రమ స్థలానికి చేరుకొని, పెద్ద సంఖ్యలో పాల్గొని శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైస్ చైర్మన్ హౌసింగ్ కమిషనర్ కోరారు.

# మెడికల్ కాలేజీకి దర్శనం వెంకటమ్మ మృతదేహం:-
# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పార్థివ దేహం అప్పగింత

**: పెన్ పవర్, సెప్టెంబర్ 20**

–మహబూబాబాద్: భావి మెడికల్ విద్యార్థుల పరీక్షల కోసం తమ తల్లి మృతదేహాన్ని మానుకోట మెడికల్ కాలేజీకి అందజేసి ఆదర్శంగా నిలిచింది. "దర్శనం" కుటుంబం. మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన దర్శనం వెంకటమ్మ (76) శనివారం మృతి చెందారు. ఆమె కుమారుడు న్యాయవాది దర్శనం రామకృష్ణ తమ్ముడు ఏఆర్ కానిస్టేబుల్ నాగార్జునలతో పాటు ఐదుగురు అక్కాచెల్లెళ్ల సహకారంతో లయన్స్ క్లబ్ ఆఫ్ మహబూబాబాద్ ప్రోత్సాహంతో తమ తల్లి వెంకటమ్మ పార్థివదేహాన్ని మెడికల్ కాలేజీకి అందించేందుకు ముందుకు వచ్చారు. హైదరాబాద్ ఆస్పత్రిలో మరణించిన వెంకటమ్మ మృతదేహాన్ని వారి నివాసానికి తరలించారు. మాజీ ఎంపీ మాలోతు కవితతో పాటు పలువురు ప్రముఖులు, రాజకీయ పార్టీల నాయకులు, న్యాయవాదులు, ప్రజా, కుల సంఘాల నాయకులు, జర్నలిస్టులు, బంధువులు తరలివచ్చి వెంకటమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం వెంకటమ్మ మృతదేహాన్ని ఊరేగింపుగా మెడికల్ కాలేజీకి తరలించారు. అక్కడ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ రెడ్డి. అటానమీ హెచ్ఓడీ డాక్టర్ భరత్ కుమార్ లకు మృతదేహాన్ని అప్పగించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ పూర్వ కార్యదర్శి




పరకాల రవీందర్ రెడ్డి, సెక్రటరీ పారుపల్లి రమేష్ బాబు, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి తప్పెట్ల స్కైలాబ్ బాబు, మా అసోసియేషన్ అధ్యక్షుడు లయన్ బొడ్డుపల్లి ఉపేందర్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు మామిడాల సత్యనారాయణ, కేసముద్రం మండల కాంగ్రెస్ అధ్యక్షులు చిలువేరు సమ్మిగౌడ్, రోటరీ క్లబ్ సెక్రటరీ శంతన్ రామరాజు, బోడ లక్ష్మణ్, యాళ్ల మురళీధర్ రెడ్డి, దుద్దెల రాంమూర్తి, ఇనుగుర్తి సుధాకర్ తదితరులు మాట్లాడారు. భర్త మరణంతో కుంగిపోకుండా అనేక కష్టాలు పడి వెంకటమ్మ తన ఏడుగురు సంతానాన్ని పెంచి పోషించి ప్రయోజకులను చేసిందని చెప్పారు. సామాజిక స్పృహతో కూడిన జీవితాన్ని గడిపిన ఆమె తన




మరణం తర్వాత కూడా సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారని చెప్పారు. తాను మరణించిన తర్వాత కూడా భావి తరాలకు ప్రాణాలను పోసే వైద్య విద్యార్థులకు పరీక్షల కోసం తన పార్థివ దేహం ఉపయోగపడుతుందని భావించి ఎందరికో స్ఫూర్తిగా నిలిచారని వెంకటమ్మ సేవలను కొనియాడారు. అందుకు సహకరించిన ఆమె కుటుంబ సభ్యులను అభినందించారు. ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని వారు ఆకాంక్షించారు. ఇంకా కార్యక్రమంలో మంగళంపల్లి రాజ్ కుమార్, బానోత్ భీమ్లా నాయక్, మందుల రఘు, వడ్లకొండ సుభాష్, మహ్మద్ సుభానీ, సలీమా, ఆరిపాక రాజేష్ దంపతులు తదితరులు పాల్గొన్నారు.

# ముధోల్ గణేష్ నిమజ్జన శోభాయాత్రకు పటిష్ఠ బందోబస్తు





**: పెన్ పవర్, సెప్టెంబర్ 20**

500 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు.. రామాలయంలో సార్వజనిక వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించి శోభాయాత్రకు శ్రీకారం చుట్టిన ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీస్ ముధోల్ పట్టణంలో గణేష్ నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. 500 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీస్ ముధోల్‌లోని రామాలయంలో ప్రతిష్ఠించిన సార్వజనిక వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గణపతి బప్పా మోరియా నినాదాల మధ్య నిమజ్జన శోభాయాత్రకు శ్రీకారం చుట్టారు. అనంతరం భక్తులతో కలిసి శోభాయాత్రలో పాల్గొన్నారు.ఎస్పీ నిమజ్జన శోభాయాత్ర మార్గాన్ని స్వయంగా పరిశీలించి, భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. శోభాయాత్ర ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ముఖ్య కూడళ్ల వద్ద బారికేడింగ్, ట్రాఫిక్ నియంత్రణ, రూట్ డైవర్షన్లు, పార్కింగ్ ప్రాంతాలు తదితర ఏర్పాట్లను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు.శోభాయాత్రలో మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు.

**ప్రజలకు ఎస్పీ విజ్ఞప్తి** గణేష్ నిమజ్జన శోభాయాత్రను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్పీ కోరారు. ప్రజలు, గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు పాటిస్తూ సహకరించాలని సూచించారు. ముధోల్ పట్టణంలో నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు 500 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీస్ , నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, ఐపీస్ , ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# తంటికొండ ఆలయ పునర్నిర్మాణానికి రూ.6 కోట్ల టీటీడీ గ్రాంట్

**: పెన్ పవర్, సెప్టెంబర్ 20**

తంటికొండ శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయ పునర్నిర్మాణానికి రూ.6 కోట్ల టీటీడీ గ్రాంట్ మంజూరుకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ గారి కృషి ఎంతో కీలకమని ఆలయ చైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్నదొర తెలిపారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ గారి ఆధ్వర్యంలో టీటీడీ ఈఓ ముద్దాడ రవిచంద్ర గారిని కలిసి, రూ.6 కోట్ల గ్రాంట్‌కు సంబంధించిన రూ.30 లక్షల మ్యాచింగ్ ఫండ్ చెక్కును దాత దాసరి సీతారాం గారి చేతుల మీదుగా అందజేశారు. అదేవిధంగా తంటికొండ శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయానికి టీటీడీ ద్వారా నిత్య అన్నదానం అందించే విషయంపై కూడా ఈఓ రవిచంద్ర గారితో చర్చించారు. ఈ సందర్భంగా తంటికొండ ఆలయ అభివృద్ధి,



పునర్నిర్మాణ కార్యక్రమాల గురించి ఈఓ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ గారు చేస్తున్న కృషికి ఆలయ కమిటీ తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అచ్చన్నదొర తెలిపారు.

ఇట్లు,బద్దిరెడ్డి అచ్చన్నదొర చైర్మన్, తంటికొండ శ్రీ వెంకటేశ్వర స్వామివారి దేవస్థానం

# చినుకులు పడితే చాలు.. రాంపల్లి చౌరస్తా మురుగుమయం!

**- చిన్న వర్షానికే మురికి నీటితో రాంపల్లి చౌరస్తా!**
**- రోడ్లపైకి మురుగు.. ప్రజలు, వాహనదారులకు అవస్థలు**
**- నాగారం అభివృద్ధిలో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం ఏదీ?**


**: పెన్ పవర్, సెప్టెంబర్ 20**


గత పదేళ్లుగా నాగారం అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నా.. రాంపల్లి చౌరస్తాలో మాత్రం డ్రైనేజీ సమస్యకు పరిష్కారం కరువైంది. చిన్నపాటి వర్షానికే రోడ్లపైకి మురుగునీరు చేరడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగునీరు రోడ్లపై ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అభివృద్ధి అంటే కేవలం భవనాలు, రోడ్ల నిర్మాణాలే కాదు.. ప్రజలకు ఇబ్బందులు లేకుండా మెరుగైన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయడం కూడా అభివృద్ధిలో భాగమేనని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

చిన్న వర్షానికే ఈ పరిస్థితి ఉంటే.. భారీ వర్షాలు



కురిస్తే రాకపోకలు బంద్ అయిన సంఘటనలు కూడా లేకపోలేదు. ఇది ఇలానే ఉంటే పరిస్థితి ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రాంపల్లి చౌరస్తా డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని నాగారం ప్రజలు కోరుతున్నారు.





# బలరామ జయంతి వేడుకలు ఘనంగా




**: పెన్ పవర్, సెప్టెంబర్ 20**

హలధరుడు, రైతుల ఆరాధ్య దైవమైన బలరామ దేవుని జయంతి వేడుకలను శనివారం భైంసా పట్టణంలోని గణేష్ నగర్ లో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గణేష్ నగర్ రైతులు, పట్టణ ప్రజల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో బలరాముని చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించారు. రైతు సంక్షేమం కోసం, పంటలు సమృద్ధిగా పండాలని, రైతన్న కళ్లలో ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు మాట్లాడుతూ... నాగలిని ఆయుధంగా ధరించి మానవాళికి వ్యవసాయ పద్ధతులను నేర్పిన ఆదిగురువు బలరాముడని కొనియాడారు. రైతు లేనిదే రాజ్యం లేదని, బలరాముని ఆదర్శాలను ప్రతి రైతు స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. భారతీయ సంస్కృతిలో బలరామ జయంతికి ఉన్న విశిష్టతను వారు వివరించారు. ఈ కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ భైంసా మండల కార్యదర్శి రావుల శివ, గణేష్ నగర్ అధ్యక్షులు తోట రాములు, ఆకుల నరేష్, కొట్నాగు, రాములు, రైతులు, భారతీయ కిసాన్ సంఘ్ కార్యకర్తలు, గణేష్ నగర్ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బోరిగాం పరిసరాల్లో చిరుత సంచారం









**- మహాదేవ్ వెంకటస్వామి ఆలయ గుట్ట వద్ద ప్రత్యక్షం.. అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ సూచన**

**: పెన్ పవర్, సెప్టెంబర్ 20:**


నిర్మల్ జిల్లా తానూర్ మండలం బోరిగాం.కె సమీపంలోని మహాదేవ్ వెంకటస్వామి దేవాలయం గుట్ట ప్రాంతంలో శనివారం రాత్రి చిరుతపులి కనిపించినట్లు ప్రయాణికులు తెలిపారు. రాత్రి సుమారు 8.45 గంటల సమయంలో రోడ్డుపై వెళ్తున్న ద్విచక్ర వాహనదారులకు చిరుత కనిపించడంతో వారు వాహనాలను నిలిపి బిగ్గరగా కేకలు వేయగా, అది సమీపంలోని గుట్ట ప్రాంతం వైపు వెళ్లిపోయినట్లు తెలిపారు. గత కొంతకాలంగా ఈ ప్రాంతంలోని అటవీ పరిసరాల్లో చిరుత సంచారం ఉన్నట్లు స్థానిక గ్రామస్థులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు, పశు వుల కాపరులు, రాత్రివేళ ప్రయాణించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు సూచిస్తున్నారు. ఈ విషయంపై అటవీశాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ శంకర్ మాట్లాడుతూ భైంసా, తానూర్ మండలాల పరిధిలోని బడగం సిరాల, ఎలేగాం, ఉమ్రి, రామ్‌టెక్, మచ్కల్, హంగీర్గ, ఎల్వి, హిప్నెల్లి, హిప్నెల్లి తండా, బోరిగాం.కె, బెంబర్, బోల్సా, వదరి, ఝురి.బి, ఝురి తండా తదితర గ్రామాల శివారులోని అటవీ ప్రాంతాల్లో చిరుత సంచారం ఉన్నట్లు తెలిపారు. ఆడ చిరుతతో పాటు రెండు పిల్లలు ఉన్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించినట్లు తెలిపారు. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం నుంచి ఈ చిరుత కుటుంబం ఆయా అటవీ ప్రాంతాల్లో సంచరిస్తూ ఉండవచ్చని అధికారులు పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. **ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు** అటవీ ప్రాంతాలు, పంట పొలాలు, గుట్ట ప్రాంతాలకు ఒంటరిగా వెళ్లకూడదని అధికారులు సూచించారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో రైతులు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పశువులను అటవీప్రాంతాలవైపుఒంటరిగావదిలేయకుండాజాగ్రత్తలుతీసుకోవాలనిసూచించారు.చిరుతకనిపించిన సమయంలో దాని వద్దకు వెళ్లడం, గుంపుగా వెంబడించడం, రాళ్లు వేయడం, కేకలు వేస్తూ రెచ్చగొట్టడం వంటి చర్యలకు పాల్పడకూడదని అటవీశాఖ అధికారులు స్పష్టం చేశారు. చిరుత కనిపిస్తే సురక్షితమైన ప్రదేశానికి చేరుకుని వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. చిరుత సంచారంపై ప్రజలు వదంతులను నమ్మకుండా అటవీశాఖ సూచనలు పాటించాలని అధికారులు కోరారు.

# పీఏ పల్లి గణేష్ ఉత్సవ సమితి కి 10,000 విరాళం ప్రకటించిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యానాయక్.

**: పెన్ పవర్, సెప్టెంబర్ 20**

పిఏ పల్లి మండలం కేంద్రానికి చెందిన గణేష్ ఉత్సవ సమితి సభ్యులు నేడు బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యానాయక్ నివాసంలో కలిసి శాలువాతో సత్కరించారు ఉత్సవ కమిటీ సభ్యులు అనంతరం రేపు జరిగే మహా వినాయకుడి పూజ కి ఆహ్వానం పలికారు అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులకు 10,000 విరాళం ప్రకటించారు ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు రవి , కోటేష్ , మణిపాల్ , అనిల్ , సంకటి రాంబాబు , అజయ్, మదన్ , నరేష్ , అన్వేష్ , రాంబాబు , ప్రవీణ్ , అనిల్ , తదితరులు ఉన్నారు.





# మాసాయిపేట్ మండల్ పోతాన్ శెట్టిపల్లి గ్రామంలో గుండెపోటుతో వ్యక్తి వృత్తి

**: పెన్ పవర్, సెప్టెంబర్ 20**

ఆయనకు ఇద్దరు కొడుకులు ఒక కూతురు కాగా గత మూడు నాలుగు సంవత్సరాల క్రితం తన చిన్న కొడుకు యాక్సిడెంట్ లో చనిపోగా అప్పటినుండి ఆయన చిన్న కొడుకుని తలుచుకుంటూ! అదేవిధంగా ఆదివారం ఉదయం 7 గంటలకు గుండెపోటుతో మరణించినట్లు గ్రామస్తులు తెలిపారు!

బక్క దేవయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పోతాన్ శెట్టిపల్లి గ్రామస్తులు ఆవేదం వ్యక్తం చేశారు!

# యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి చరిత్ర మరియు స్థల పురాణం

**: పెన్ పవర్, సెప్టెంబర్ 20**



స్థల పురాణం – యదమహర్షి తపస్సు: త్రేతాపు యుగంలో ఋష్యశృంగ మహర్షి కుమారుడైన యద మహర్షి అనే గొప్ప ముని అంజనేయ స్వామి అనుగ్రహంతో ఈ కొండపై ఒక గుహలో శ్రీ మహావిష్ణువు కోసం తీవ్రమైన తపస్సు ఆచరించాడు.

పంచ నరసింహ రూపాలు: యద మహర్షి భక్తికి మెచ్చిన శ్రీ మహావిష్ణువు ఉగ్రరూపుడైన నరసింహ స్వామిగా ప్రత్యక్షమయ్యాడు. అయితే ఆ ఉగ్రతను తట్టుకోలేకపోవడంతో, స్వామివారు వేర్వేరు సమయాల్లో ఐదు రూపాల్లో దర్శనమిచ్చారు. అవే:జ్వాలా నరసింహ స్వామి,యోగానంద నరసింహ స్వామి,ఉగ్ర నరసింహ స్వామి,గండభేరుండ నరసింహ స్వామి,లక్ష్మీ నరసింహ స్వామి,ఇలా ఐదు రూపాలు వెలసిన క్షేత్రం కావడంతో దీనిని "పంచ నరసింహ క్షేత్రం" అని పిలుస్తారు.క్షేత్ర నామకరణం: మహర్షి తపస్సుకు ప్రసన్నుడైన స్వామివారు ఈ కొండపై శాశ్వతంగా కొలువుంటానని మాటిచ్చారు. ఆ మహర్షి పేరు మీదుగా ఈ కొండను "యాదగిరి" (యాదాద్రి) అని పిలవడం ప్రారంభమైంది. వైద్య నరసింహుడిగా కొంగుబంగారం: ఇక్కడ స్వామివారు కేవలం దేవుడిగానే కాకుండా రోగాలను నివారించే వైద్యుడిగా (వైద్య నరసింహ) భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్నారు. మానసిక రుగ్మతలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు ఇక్కడ స్వామివారిని దర్శించుకుంటే స్వస్థత చేకూరుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

# నడిరోడ్డుపై కొండచిలువ కలకలం



**: పెన్ పవర్, సెప్టెంబర్ 20**

సంచారం: వరంగల్ జిల్లా వర్ధన్నపేటలో కొండచిలువ సంచారం స్థానికులను భయాందోళనకు గురి చేసింది.

ప్రత్యక్ష సాక్ష్యం: దమ్మన్నపేట నుంచి బండౌతపురం వెళ్లే రహదారిపై 5 అడుగులకు పైగా పొడవున్న కొండచిలువ వాహనదారుల కంటపడింది. దీంతో వారు ఈ దృశ్యాలను ఫోటోలు, వీడియోలు తీసి సోషల్ మీడియాలో షేర్ చేశారు.

స్థానికుల ఆందోళన: ఇటీవల ఉప్పరపల్లి క్రాస్‌రోడ్డు సమీపంలోని జాతీయ రహదారిపై కూడా కొండచిలువ కనిపించినట్లు స్థానికులు చెప్పుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# సుందరయ్య నగర్ గణపతిని దర్శించుకున్న కాంగ్రెస్ నాయకులు.

**: పెన్ పవర్, సెప్టెంబర్ 20**

మధిర పట్టణంలోని సుందరయ్య నగర్ లో ఏర్పాటు చేసిన వినాయకుడిని దర్శించుకొని ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రంగా హనుమంతరావు, శివాలయం మాజీ చైర్మన్ పాతిబండ్ల సత్యంబాబు, మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సురాంశెట్టి కిషోర్, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కృష్ణాపురం గ్రామ మాజీ సర్పంచ్ కర్నాటి రామారావు నెల్లూరు రాము స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ప్రసాదాలు స్వీకరించారు.



## మృతి చెందిన షేక్.జమీలాబీ కుటుంబానికి 5వేలు ఆర్థిక సహాయం అందించిన వేంపెంట మాజీ సర్పంచ్ టేకూరి రామసుబ్బమ్మ

: పెన్ పవర్, సెప్టెంబర్ 20



పాములపాడు మండలంలోని, వేంపెంట గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన షేక్.జమిలాబి (70)పార్థివ దేహానికి మాజీ సర్పంచ్ టేకూరి రామసుబ్బమ్మ పూల మాల వేసి, నివాళులు అర్పించి ఆమె కుటుంబానికి 5000/- రూపాయలు ఆర్థిక సహాయం అందించారు.ధైర్యంగా ఉండాలని ఆ కుటుంబానికి టేకూరి రామసుబ్బమ్మ భరోసా ఇచ్చారు. ఈ విషయం తెలుసుకొని సింగపూర్ దేశం నుండి డాక్టర్ టేకూరి.నాగేశ్వరావు ఆమె కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని, సంతాపం తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ బోనపల్లె సత్యరాజు, మాజీ ఎంపీటీసీ శివకుమార్, ముద్దపాటి ప్రసాద్, రత్నాకర్, జీవన్న, బోనాల భాస్కర్, సుబ్బారావు, దార కిరణ్, సుబ్బారాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో.. టీమ్ మండలనేని చరణ్ తేజ ఆధ్వర్యంలో 'ప్రాజెక్ట్ గ్రీన్ వారియర్స్




: పెన్ పవర్, సెప్టెంబర్ 20

ఉరవకొండ: పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆశయాల స్ఫూర్తితో టీమ్ మండలనేని చరణ్ తేజ ఆధ్వర్యంలో ఉరవకొండ ప్రభుత్వ కళాశాలలో "ప్రాజెక్ట్ గ్రీన్ వారియర్స్" కార్యక్రమం విజయవంతంగా జరిగింది. మేరా యువ భారత్ సమన్వయంతో నిర్వహించిన ఈ సదస్సు స్థానిక యువతలో పర్యావరణ స్ఫూర్తిని రగిలించింది. ఈ సందర్భంగా.. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, పునర్వినియోగ సంచుల వాడకం, పర్యావరణహిత ఉత్పత్తుల వినియోగం, స్వచ్ఛమైన హరిత ఇంధన వనరుల ఆవశ్యకతపై విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించారు. రోజువారీ జీవితంలో చిన్నచిన్న మార్పులు చేసుకోవడం ద్వారా సుస్థిర భవిష్యత్తుకు బాటలు వేయవచ్చని, యువత అంతా చైతన్యవంతమైన "గ్రీన్ వారియర్స్"గా మారాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. పవన్ కళ్యాణ్ గారి ఆదర్శాలను ముందుకు తీసుకెళ్తూ, పచ్చని భవిష్యత్తు కోసం టీమ్ మండలనేని చరణ్ తేజ చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమం సర్వత్రా ప్రశంసలు అందుకుంటోంది.

## ఛలో కొడంగల్.. పాంచ జన్య సంకల్ప సభ డా బోడ అనిల్ కుమార్ నాయక్.

: పెన్ పవర్, సెప్టెంబర్ 20


కార్యకర్తలు,ప్రజలు పెద్ద ఎత్తున హాజరై సభను విజయవంతం చేశారు.

తెలంగాణ రక్షణ సేన పాంచ జన్య సూత్రాలను తెలంగాణలో ఉండేఅన్నివర్గాలపజలకిన్యాయంజరిగేవిధంగాఉచితవైద్యం,ఉచితవిద్య,ఉపాధివ్యవసాయం,సామాజిక న్యాయ తెలంగాణ కోసం ప్రజలందరూ కవితమ్మకి బాసటగా నిలవాలని తద్వారా రాబోయే అసెంబ్లీ ఎలక్షన్లో అత్యధిక స్థానాలు గెలిచి అధికారం దిశగా మీరు తోడ్పాటు అందించాలని కవిత ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. పాంచ జన్య సంకల్ప సభలో టిఆర్ఎస్ మహబూబాబాద్ పార్లమెంట్ ఇన్చార్జి డా అనిల్ కుమార్ నాయక్ పాల్గొన్నారు. నాయకులు

## పేట మార్కెట్ కాంప్లెక్స్ వద్ద మురుగు సమస్య: అధికారుల నిర్లక్ష్యంతో వ్యాపారుల అవస్థలు



: పెన్ పవర్, సెప్టెంబర్ 20

చిలకలూరిపేట పట్టణంలోని మార్కెట్ కాంప్లెక్స్ వెలుపల ఉన్న దుకాణదారులు తీవ్ర మురుగు సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. గత రాత్రి కురిసిన వర్షానికే కాకుండా, ఎప్పుడు చిన్నపాటి వర్షం పడినా కాలువల్లోని మురుగు నీరు ఉప్పొంగి నేరుగా షాపుల వద్దకు చేరుకుంటోంది. దుకాణాల ముందు మురుగు చేరడంతో వినియోగదారులు రాక వ్యాపారాలు దెబ్బతినడమే కాకుండా, ఆ దుర్గంధాన్ని భరించలేక వ్యాపారులే స్వయంగా మురుగును శుభ్రం చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఈ సమస్యపై ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా మున్సిపల్ అధికారులు కనీస దృష్టి సారించడం లేదని షాపుల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి ఈ మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## గంగన్నపాలెం లో ఘనంగా జరిగిన విఘ్నేశ్వరుని పూజలో పాల్గొన్న ప్రత్తిపాటి

: పెన్ పవర్, సెప్టెంబర్ 20



చిలకలూరిపేట మండలం గంగన్నపాలెం గ్రామంలోని తెలుగుయువత ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శ్రీ విఘ్నేశ్వర స్వామివారి మండపంలో కమిటీ వారి ఆధ్వర్యంలో జరుగుచున్న ప్రత్యేక పూజల్లో పాల్గొని, స్వామివారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించిన మాజీ మంత్రివర్యులు, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అనంతరం ప్రత్తిపాటి మాట్లాడుతూ వినాయకుని ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

## కే.ఎస్.ఎస్. క్రాకర్స్ యజమాని భూమా సురేష్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి శ్రీమతి విడదల రజిని



: పెన్ పవర్, సెప్టెంబర్ 20

చిలకలూరిపేట పట్టణానికి చెందిన భూమా సురేష్ ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో మృతి చెందడం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేసిన మాజీ మంత్రి విడదల రజిని , ఈరోజు ఆయన నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు.ఈ విషాద సమయంలో కుటుంబసభ్యులకు ధైర్యం చెబుతూ, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## అన్న దాన కార్యక్రమం లో పాల్గొన్న మాజీ ఎంపీ మాలోత్ కవిత




: పెన్ పవర్, సెప్టెంబర్ 20

మహబూబాబాద్ మున్సిపాలిటీ 33 వ వార్డు నెహ్రూ సెంటర్ లో గణేష్ ఉత్సవ కమిటీ వారి ఆహ్వానం మేరకు గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన మహబూబాబాద్బిమాజీబిపార్లమెంట్బిసభ్యులుకవితబిమాలోత్,హరితబిక టికనేని నిహాల్ కృష్ణ వారి వెంట ముత్యం వెంకన్న గౌడ్,మహబూబ్ పాషా,మనాది రాజేష్,కమిటీ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పేరు మార్చుకున్న ఐఏఎస్ అధికారి.. 'వి.సంజనా సింహ' ఇక పై 'సంజనా శ్రీహర్ష'

: పెన్ పవర్, సెప్టెంబర్ 20



నరసరావుపేట - ఆంధ్రప్రదేశ్ కేడరు చెందిన ఐఏఎస్ అధికారి వి.సంజనా సింహ తన పేరును మార్చుకున్నారు.తన పేరును 'వి.సంజనా సింహ' నుంచి 'సంజనా శ్రీహర్ష'గా మారుస్తూ నిర్ణయం తీసుకున్నారు.ఈ మేరకు కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పింఛన్ల మంత్రిత్వ శాఖ సెప్టెంబరు 19, 2026న అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసింది.ఈ నోటిఫికేషన్ ప్రతులని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, అకౌంటెంట్ జనరల్, యూపీఎస్సీ సంబంధిత విభాగాలకుసమాచారం నిమిత్తం పంపించారు.

## జర్నలిస్టు కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



: పెన్ పవర్, సెప్టెంబర్ 20

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం గుర్తూరుకు చెందిన తొర్రూరు జర్నలిస్టు పెండోట కిషన్ చారి తండ్రి లింగాచారి మృతి చెందగా ఆదివారం దశదిన కర్మ కార్యక్రమానికి తొర్రూరు జర్నలిస్టు మిత్రులు హాజరై కిషన్ చారి కుటుంబాన్ని పరామర్శించి రూ.11,500 /- ఆర్థిక సాయం అందజేశారు. ఈకార్యక్రమంలో సామాజికవేత్త జాటోత్ సాయి కృష్ణ, హరికిషన్, జర్నలిస్టులు గజ్జెల వినోద్ రెడ్డి, మహమ్మద్ అమీర్, వెల్తూరి పూర్ణ రామచందర్, చౌడవరపు రాము, కొండం అశోక్ రెడ్డి, కొమ్మనబోయిన యాకన్న, కొమ్ము దేవేందర్, కుక్కల కృష్ణ, జగదీష్, మురళి, సర్వి నాగరాజు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యానికి జాతీయ రహదారి పై ప్రమాదం వీధిదీపాలు లేక పేటలో మరో ప్రమాదం

: పెన్ పవర్, సెప్టెంబర్ 20




చిలకలూరిపేట పట్టణ నడిబొడ్డున అధికారుల నిర్లక్ష్యం మరోసారి ఓ పేదవాడి పాలిట శాపంగా మారింది. నరసరావుపేట సెంటర్ నుండి విజయా బ్యాంక్ వరకు జాతీయ రహదారిపై గత కొంతకాలంగా వీధిదీపాలు వెలగకపోవడంతో ఆ ప్రాంతం అంధకారంలో మగ్గుతోంది. చీకటి కారణంగా నిత్యం జరుగుతున్న ప్రమాదాలపై వార్తా మాధ్యమాల ద్వారా అధికారుల దృష్టికి పదేపదే తీసుకెళ్లినా కనీస స్పందన కరువైంది. ఈ అధికారిక ఉదాసీనతకు తాజాగా మరో అమాయకుడు ప్రమాదానికి గురయ్యాడు సోనోవిజన్ షోరూమ్ ఎదురుగా దట్టమైన చీకట్లో వేగంగా వచ్చిన ఓ యాక్సెస్ స్కూటీ అదుపుతప్పి ఓ వ్యక్తిని బలంగా ఢీకొట్టింది. బతుకుదెరువు కోసం సుదూర ప్రాంతమైన పార్వతీపురం మన్యం జిల్లా నుండి వలస వచ్చిన పోలిరాజు అనే కార్మికుడు ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అతడి తలకు, కాలుకు బలమైన గాయం తగలడంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోడ్లపై ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోని అధికారుల తీరుపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంకెంతమంది అమాయకుల రక్తం చిందితే ఈ జాతీయ రహదారికి వెలుగులొస్తాయోనని ప్రజలు మండిపడుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి వీధిదీపాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు.

## అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమం.

: పెన్ పవర్, సెప్టెంబర్ 20



చింతపల్లి మండలం లోని చింతపల్లి సెక్టార్ ఉమంతలపల్లి అంగన్వాడి కేంద్ర పరిధిలో సిడిపిఓ గారి ఆధ్వర్యంలో పోషణ మాస కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా పోషకాహారం తీసుకోవడం వలన కలిగే ఉపయోగాలు పిల్లల తల్లుల మధ్య ఆరోగ్య అనుభవాలు పెంచడంపై ప్రాముఖ్యత, పోషకాహార పిల్లల తల్లుల మధ్య అనుభవాలు పెంచడం, ఐసిడిఎస్ సూపర్వైజర్ వి అంజమ్మ,సర్పంచ్ వంగాల స్రవంతి రమేష్ గారు, జిపిఓ భాస్కర్, స్కూల్ హెచ్ఎం రమేష్, సునీత ఏ డబ్ల్యు, టీచర్ ఎం పద్మ, జయమ్మ, యాదమ్మ, అంగన్వాడి హెల్పర్స్ తిరుపతమ్మ పార్వతి గ్రామ పెద్దలు తల్లులు పిల్లలు పాల్గొన్నారు

## ఏక్ పేడ్ మా కే నామ్" కార్యక్రమం లో పాల్గొన్న గ్రామ సర్పంచ్ పగిడిపల్లి శ్రీనివాసరావు.



పెన్ పవర్, సెప్టెంబర్ 20

మధిర రూరల్ :రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల కు అందిస్తున్న నూతన యూనిఫాంను పంపిణీ చేసిన సర్పంచ్ పగిడిపల్లి శ్రీనివాసరావు.మధిర మండలం దెందుకూరు గ్రామ పంచాయతీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏక్ పేడ్ మా కే నామ్ మనకు జన్మనిచ్చిన మాతృమూర్తి పై ప్రేమతో ఆమెను అభినందిస్తూ ఒక మొక్కను నాటడం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటిన సర్పంచ్ పగిడిపల్లి శ్రీనివాసరావు, తనతో పాటు పాఠశాలలో ఉన్న విద్యార్థినీ విద్యార్థులుచే ఉపాధ్యయినీ ఉపాద్యాయులు చే కూడా మొక్కలు నాటించారు అదే విధంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న నూతన యూనిఫాం పంపిణీ చేసారు చేశారు.
ఈ కార్యక్రమంలో దెందుకూరు పంచాయతీ పాలకవర్గం, ఈ జీ యస్ సిబ్బంది, యఫ్ ఏ గారు పాఠశాల ఉపాధ్యయినీ ఉపాధ్యాయులు, మరియు గ్రామ పెద్దలు పిల్లలు , ఉత్సాహంగా పాల్గొన్నారు

## జగదాంబ మాత , సేవాలాల్ మహారాజ్ దేవాలయ నిర్మాణానికి ఇసుక, సిమెంట్ విరాళం

**- ఆలయ నిర్మాణానికి లారీ ఇసుక, 300 బస్తాల సిమెంట్ విరాళం.**
**- కర్మన్ ఘాట్ ఆంజనేయ స్వామి దేవాలయ మాజీ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి.**

: పెన్ పవర్, సెప్టెంబర్ 20



దేవాలయ నిర్మాణానికి సామగ్రిని విరాళంగా ఇవ్వడం ఎంతో పుణ్యప్రదమైన కార్యం. మన సనాతన ధర్మంలో దేవాలయ నిర్మాణంలో భాగస్వామ్యం పంచుకోవడాన్ని "పూర్త కర్మ" అని పిలుస్తారు, ఇది వంశాభివృద్ధిని, పుణ్యఫలాన్ని ఇస్తుందని నమ్ముతారు.
సృష్టిలో ఆధ్యాత్మికతకు మించిన ఆనందం మరొకటి ఉండదని కర్మన్ ఘాట్ ఆంజనేయస్వామి దేవాలయ మాజీ ఛైర్మెన్ నల్ల రఘుమారెడ్డి అన్నారు. ఆదివారం చింతపల్లి మండల పరిధిలోని ప్రశాంతపురి గ్రామపంచాయతీలో జగదాంబ మాత, సేవాలాల్ మహారాజ్ దేవాలయాల నిర్మాణం కొనసాగుతోంది. మాజీ జెడ్పిటిసి జటావత్ హరినాయక్ ద్వారా విషయం తెలుసుని ఆయన సహకారంతో తన వంతు చేయూతగా ఒక లారీ ఇసుక, 300 బస్తాల సిమెంటును గ్రామ సర్పంచ్ కేతావత్ శ్రీను నాయక్, ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీను నాయక్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరు ఆధ్యాత్మికత భక్తిభావంతో వ్యవహరించాలని కోరారు. ప్రతి మనిషికి భక్తితోనే ముక్తి లభిస్తుందని ఆయన తెలిపారు.
అమ్మవారు, సేవాలాల్ మహారాజ్ దేవాలయ నిర్మాణం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న దేవాలయ కమిటీ సభ్యులను ఆయన అభినందించారు.
ప్రజలు కూడా తమ శక్తి కొలది అమ్మవారి దేవాలయ నిర్మాణానికి విరాళాలు అందజేస్తే ఎంతో మేలవుతుందని, ఆయన కోరారు. అదేవిధంగా ఆలయానికి నిర్మాణ సామాగ్రి అందజేసిన కర్మన్ ఘాట్ ఆంజనేయస్వామి దేవాలయ మాజీ ఛైర్మెన్ నల్ల రఘుమారెడ్డికి ప్రశాంతపురి తండ గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయన సేవలను కొనియాడారు.

## ఝురి బి గ్రామంలో ఘనంగా గణేష్ ఉత్సవాల ముగింపు రూ.12,551లకు లడ్డు వేలం.. నరోటె మారుతి పండిత్ పాటిల్ సొంతం



: పెన్ పవర్, సెప్టెంబర్ 20

తానూర్ మండలం ఝురి బి గ్రామంలోని సార్వజనిక్ గణేష్ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ ఉత్సవాలువ భక్తిశ్రద్ధలతో ముగిశాయి. ఉత్సవాల చివరి రోజు నిర్వహించిన హారతి కార్యక్రమంలో గ్రామస్థులు, మహిళలు, యువకులు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా నిర్వహించిన లడ్డు వేలం పాటలో నరోటె మారుతి పండిత్ పాటిల్ రూ.12,551లకు లడ్డు సొంతం చేసుకున్నారు. అలాగే గణపతి బప్పా పెన్నును రూ.1,551లకు సార్వజనిక్ గణేష్ మండలి అధ్యక్షులు దొంతుల రమేష్ దక్కించుకున్నారు.కార్యక్రమంలో గణేష్ మండలి అధ్యక్షులు దొంతుల రమేష్ ఉపాధ్యక్షులు ఈశ్వర్ పాటిల్, మహారాజ్ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు, మహిళలు, యువకులు, యువతులు పాల్గొని గణపతి బప్పాకు ప్రత్యేక హారతి నిర్వహించారు. గణపతి బప్పా మోరియా నినాదాలతో ఝురి బి గ్రామంలో భక్తి వాతావరణం నెలకొంది.

# 'మమ్మల్ని నకిలీలుగా చూపొద్దు.. వైసీపీ అసత్య ప్రచారంపై నినదించిన స్పోర్ట్స్ కోటా టీచర్లు



**హైదరాబాద్ పెన్ పవర్:** మైదానంలో ప్రత్యర్థులతో పోరాడి పతకాలు సాధించిన క్రీడాకారులు.. ఇప్పుడు తమ నియామకాలపై వస్తున్న ఆరోపణలతో మరో పోరాటాన్ని ఎదుర్కొంటున్నారు. మెగా డీఎస్సీ–2025లో స్పోర్ట్స్ కోటా ద్వారా ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థులు తమ నియామకాలను సమర్థించుకుంటూ విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 370 మంది ఉపాధ్యాయులు హాజరైన ఈ సమావేశం.. తమపై జరుగుతున్న ప్రచారానికి సమాధానం చెప్పే వేదికగా మారింది.

**మమ్మల్ని నకిలీలుగా చూపొద్దు**

తమ నియామకాల్లో అక్రమాలు జరిగాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సహా కొందరు చేస్తున్న ఆరోపణలను ఉపాధ్యాయులు ఖండించారు. రాజకీయ విమర్శల కోసం తమ క్రీడా ప్రస్థానాన్ని.. ప్రతిభను ప్రశ్నించడం బాధాకరమని పేర్కొన్నారు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో పోటీల్లో పాల్గొని పతకాలు సాధించిన తర్వాతే తాము స్పోర్ట్స్ కోటా ద్వారా ఉద్యోగాలకు అర్హత సాధించామని తెలిపారు. "మైదానంలో తగిలిన గాయాల కంటే.. నకిలీ అభ్యర్థులమంటూ వస్తున్న ఆరోపణలే ఎక్కువగా బాధిస్తున్నాయి" అని పలువురు అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ అర్హతలపై అనుమానాలు ఉన్నవారు ఒరిజినల్ సర్టిఫికెట్లు, పతకాలు, క్రీడా రికార్డులను పరిశీలించాలని వారు సూచించారు.

**పాత రికార్డులే ఆధారాలుగా..**

తమ క్రీడా నేపథ్యాన్ని నిరూపించేందుకు పలువురు ఉపాధ్యాయులు సమావేశంలో పాత ఫొటోలు, వీడియోలను ప్రదర్శించారు. వివిధ పోటీల్లో పాల్గొన్న సందర్భాలు, సాధించిన పతకాలకు సంబంధించిన వివరాలను చూపించారు. దీంతో తమ ఎంపిక కేవలం కాగితాలపై జరిగిన ప్రక్రియ కాదని.. ఏళ్ల తరబడి సాగిన క్రీడా ప్రయాణానికి దక్కిన గుర్తింపు అని వారు వివరించారు.

**రిజర్వేషన్‌పై వివరణ**

స్పోర్ట్స్ కోటా నియామకాలు రాజ్యాంగబద్ధమైన హారిజంటల్ రిజర్వేషన్ విధానంలోనే జరుగుతాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వంలోని తపాలా, ఐటీ, డీఆర్డీఓ, రైల్వే తదితర విభాగాల్లోనూ క్రీడాకారులకు ప్రత్యేక అవకాశాలు కల్పించే నియామక విధానాలు ఉన్నాయని వివరించారు. బ్రిడ్జ్ గేమ్‌ను పేకాటతో పోలుస్తూ జరుగుతున్న ప్రచారంపైనా వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. క్రీడల స్వభావం, నిబంధనలు తెలియకుండా ఒక క్రీడను తక్కువ చేసి మాట్లాడటం సరైంది కాదని అన్నారు.

**మాజీ సైనికుడి ఆవేదన**

సమావేశంలో మాట్లాడిన మాజీ సైనికుడు చక్రపాణిరెడ్డి తన అనుభవాలను ప్రస్తావించారు. దేశసేవ చేసిన తర్వాత క్రీడా కోటా ద్వారా ఉద్యోగం సాధించిన తనను కూడా అనుమానాస్పద వ్యక్తిగా చిత్రీకరించడం బాధాకరమని అన్నారు. వ్యక్తిగత రికార్డులు, ధ్రువపత్రాలను పరిశీలించకుండా ఆరోపణలు చేయడం సరికాదని పేర్కొన్నారు.

**రాజకీయాలకు మమ్మల్ని బలిచేయొద్దు**

ఖో–ఖో క్రీడాకారుడు పి.శివారెడ్డి మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారుల శ్రమను రాజకీయ వివాదాలకు ఉపయోగించవద్దని కోరారు. క్రీడాకారులకు ప్రభుత్వం కల్పించిన రిజర్వేషన్ తమలాంటి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించిందని, దానిని అవమానించేలా ప్రచారం చేయడం సరికాదని అన్నారు.

**ప్రభుత్వం నిర్ణయానికి కృతజ్ఞతలు**

క్రీడాకారుల కోటాను 3 శాతానికి పెంచిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. తమ నియామకాల్లో టెట్ అర్హతను కూడా పరిగణనలోకి తీసుకున్నారని.. టెట్ రాయకుండా ఎవరికీ ఉద్యోగం రాలేదని వారు పేర్కొన్నారు. తమ విద్యార్హతలు, క్రీడా వివరాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మెగా డీఎస్సీ–2025 ప్రక్రియ మంత్రి నారా లోకేశ్ పర్యవేక్షణలో పారదర్శకంగా జరిగిందని పలువురు అభ్యర్థులు అభిప్రాయపడ్డారు.

**అసలు ప్రశ్న.. ఆరోపణలా? ఆధారాలా?**

స్పోర్ట్స్ కోటా టీచర్ల సమావేశం ద్వారా ఒక విషయం స్పష్టమైంది. నియామక ప్రక్రియపై రాజకీయ ఆరోపణలు, అభ్యర్థుల నుంచి వస్తున్న ప్రతివాదాలు ప్రస్తుతం పరస్పరం ఎదురెదురుగా ఉన్నాయి. ఒకవైపు నియామకాలపై అనుమానాలు వ్యక్తమవుతుండగా.. మరోవైపు అభ్యర్థులు తమ వద్ద ఉన్న ధ్రువపత్రాలు, క్రీడా రికార్డులను పరిశీలించాలని సవాల్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ ఆరోపణలు, అభ్యర్థుల వివరణలను పక్కనపెట్టి.. అధికారిక నియామక నిబంధనలు, ధ్రువపత్రాల పరిశీలన, ఎంపిక ప్రక్రియకు సంబంధించిన రికార్డుల ఆధారంగానే వాస్తవాలు తేలాల్సి ఉంటుందని స్పోర్ట్స్ కోటా ఉపాధ్యాయులు చెబుతున్నారు. తమ ఉద్యోగాలను రాజకీయ వివాదానికి కేంద్రంగా మార్చకుండా వాస్తవాలను పరిశీలించాలని వారు కోరుతున్నారు.

# హైఅలర్ట్‌లో ఐరోపా దేశాలు.. రష్యాతో యుద్ధానికి సిద్ధమవుతున్నాయా?




**హైదరాబాద్ పెన్ పవర్:** ఉక్రెయిన్––రష్యా యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో ఐరోపాలో భద్రతా ఆందోళనలు మరోసారి పెరిగాయి. ముఖ్యంగా రష్యా నుంచి డ్రోన్లు, మిస్సైళ్లు, సైబర్ దాడులు, ఇతర హైబ్రిడ్ దాడుల ముప్పు ఉందన్న హెచ్చరికలు యూరప్ దేశాలను అప్రమత్తం చేస్తున్నాయి. అయితే ఈ పరిణామాలను నేరుగా "మూడో ప్రపంచ యుద్ధానికి సన్నాహాలు"గా అర్థం చేసుకోవడం కంటే.. యూరప్ తన నిరోధక సామర్థ్యాన్ని పెంచుకుంటున్న దశగా చూడటం అవసరం.

ఇటీవల పోలాండ్ ప్రధాని డొనాల్డ్ టస్క్ మాట్లాడుతూ.. రష్యా ఉక్రెయిన్‌కు మద్దతు ఇస్తున్న నాటో దేశాలపై "అనుకోకుండా జరిగినట్లు" చూపించే డ్రోన్ లేదా మిస్సైల్ దాడులకు పాల్పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా నాటో తూర్పు సరిహద్దుల్లో ఇలాంటి ఘటనలు జరిగితే ఆ దేశాలు నాటో ఆర్టికల్ 5ను అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నాయా లేదా అన్నది పరీక్షించే ఉద్దేశం ఉండొచ్చని ఆయన పేర్కొన్నారు. ఇవి పోలాండ్ ఇంటెలిజెన్స్ అంచనాల ఆధారంగా చేసిన హెచ్చరికలని టస్క్ చెప్పారు.

**ఆర్టికల్ 5 ఎందుకు కీలకం?**

నాటో ఆర్టికల్ 5 ప్రకారం ఒక సభ్యదేశంపై సాయుధ దాడిని కూటమి మొత్తం మీద దాడిగా పరిగణించే సూత్రం ఉంది. అందుకే నాటో సభ్యదేశ భూభాగంలో రష్యా దాడి జరిగితే అది కేవలం రష్యా––ఉక్రెయిన్ యుద్ధం పరిధిలో ఉండకుండా పెద్ద భద్రతా సంక్షోభంగా మారే అవకాశం ఉంటుంది. అయితే ఆర్టికల్ 5 అనేది ఆటోమేటిక్‌గా ఒకే విధమైన సైనిక చర్యను నిర్దేశించదు.. మిత్రదేశాలు అవసరమైన చర్యలను నిర్ణయిస్తాయి. నాటో కూడా ప్రస్తుతం రష్యా యుద్ధాన్ని యూరో–అట్లాంటిక్ భద్రతకు తీవ్రమైన ముప్పుగా పేర్కొంటూ తన నిరోధక, రక్షణ సామర్థ్యాలను పెంచుతున్నట్లు చెబుతోంది.

**ఫ్రాన్స్, జర్మనీ, స్వీడన్ ఎందుకు సిద్ధమవుతున్నాయి?**

ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ఇటీవల రష్యా నుంచి వస్తున్న హైబ్రిడ్ ముప్పులు పెరుగుతున్నాయని పేర్కొంటూ కీలక మౌలిక సదుపాయాల రక్షణకు ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. సైబర్ దాడులు, డ్రోన్లు వంటి పద్ధతులు సంప్రదాయ యుద్ధానికి భిన్నంగా ఉంటాయని ఫ్రాన్స్ భావిస్తోంది. ఇక స్వీడన్‌లోని గాట్‌ల్యాండ్ ద్వీపం బాల్టిక్ సముద్రంలో వ్యూహాత్మకంగా కీలకమైన ప్రాంతం. సెప్టెంబర్ 14––23 మధ్య జర్మనీ, స్వీడన్ కలిసి నిర్వహిస్తున్న సిల్వర్ ఓటాన్ సైనిక విన్యాసాల్లో గాట్‌ల్యాండ్ చుట్టూ భద్రత, సైనిక బలగాల వేగవంతమైన మోహరింపు వంటి అంశాలను ప్రాక్టీస్ చేస్తున్నారు. బ్రిటన్ కూడా అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంచుతోంది. 2026 నేషనల్ రిస్క్ రిజిస్టర్‌లో దేశానికి ఎదురయ్యే తీవ్రమైన ప్రమాదాలను ప్రభుత్వం అధికారికంగా నమోదు చేసింది. రష్యా నుంచి వస్తున్న "సబ్ థ్రెషోల్డ్ అటాక్స్", సైబర్ దాడులు తదితర ముప్పులు కూడా బ్రిటన్ రిజిలియెన్స్ ప్రణాళికల్లో భాగమయ్యాయి.

**మరి మూడో ప్రపంచ యుద్ధం వస్తుందా?**

ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారంతో రష్యా నాటోపై పూర్తి స్థాయి యుద్ధానికి సిద్ధమవుతోందని ఖచ్చితంగా చెప్పడానికి ఆధారం లేదు. అదే సమయంలో యూరప్ దేశాలు ముప్పును తేలికగా తీసుకోవడం కూడా లేదు. డ్రోన్లు, సైబర్ దాడులు, సబోటేజ్, మౌలిక సదుపాయాలపై దాడులు వంటి "హైబ్రిడ్ వార్‌ఫేర్" ప్రమాదాలు ఇప్పటికే యూరప్ భద్రతా లెక్కల్లోకి వచ్చాయి.

మరోవైపు రష్యా––నాటో మధ్య నేరుగా ఘర్షణకు దారితీసే ఏ ఘటనైనా పరిస్థితిని వేగంగా మార్చగలదు. అందుకే యూరప్ చేస్తున్న సైనిక విన్యాసాలు, ఆసుపత్రులు.. అత్యవసర వ్యవస్థల సిద్ధత, సరిహద్దు రక్షణ చర్యలను యుద్ధం ఖాయం అనే సంకేతాలుగా కాకుండా.. యుద్ధం లేదా హైబ్రిడ్ దాడులు జరిగితే వాటిని ఎదుర్కొనే నిరోధక చర్యలుగా చూడటం మరింత సరైనది. అసలు యూరప్ ముందున్న ప్రధాన ప్రశ్న ఇదే.. యుద్ధం మొదలవుతుందా? అన్నదానికంటే.. యుద్ధం జరగకుండా రష్యాకు ఎంత బలమైన నిరోధక సంకేతం ఇవ్వగలదు? ప్రస్తుతం యూరప్ తీసుకుంటున్న చర్యల వెనుక ఉన్న ప్రధాన వ్యూహాత్మక ఆలోచన ఇదే.

# పండుగ రద్దీకి రైల్వే ఏర్పాట్లు.. ఏపీ, తెలంగాణ మధ్య ప్రత్యేక రైళ్లు

**హైదరాబాద్ పెన్ పవర్:** దసరా పండుగ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. రద్దీని నివారించేందుకు చర్లపల్లి – శ్రీకాకుళం మధ్య 16 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ప్రకటించింది. ప్రయాణికుల సౌకర్యార్థం ఈ రైళ్లను అక్టోబర్, నవంబర్ నెలల్లో అందుబాటులోకి తీసుకురానున్నారు. షెడ్యూల్ వివరాల ప్రకారం.. రైలు నంబర్ 07037 (చర్లపల్లి – శ్రీకాకుళం) అక్టోబర్ 6, 13, 20, 27 తేదీలతో పాటు నవంబర్ 3, 10, 17, 24 తేదీల్లో నడవనుంది. తిరుగు ప్రయాణంలో రైలు నంబర్ 07038 (శ్రీకాకుళం – చర్లపల్లి) అక్టోబర్ 7, 14, 21, 28 మరియు నవంబర్ 4, 11, 18, 25 తేదీల్లో ప్రయాణికులకు అందుబాటులో ఉంటుంది. ఈ ప్రత్యేక రైళ్లు నల్గొండ, మిర్యాలగూడ, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, సింహాచలం, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి స్టేషన్లలో ఆగుతాయి. వీటితో పాటు చర్లపల్లి – నాగర్‌కోయిల్ మార్గంలోనూ 10 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైలు నంబర్ 07535 సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 23 వరకు ప్రతి శుక్రవారం, రైలు నంబర్ 07536 సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 25 వరకు ప్రతి ఆదివారం నడవనున్నాయి. పండుగ సీజన్‌లో సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులు ఈ ప్రత్యేక సర్వీసులను వినియోగించుకోవాలని అధికారులు సూచించారు.

## నాదెండ్ల సందేశం....జనసేనకు ఎన్ని సీట్లు ?




**హైదరాబాద్ పెన్ పవర్:** జనసేన ఈసారి అంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి భారీగానే ఆశలు పెట్టుకుంది. మరీ ముఖ్యంగా గ్రౌండ్ లెవెల్ లో ఉన్నద్వితీయ తృతీయ శ్రేణి నాయకులు, అలాగే క్యాడర్ కూడా ఎక్కువ సీట్లు పోటీ చేయాలని చూస్తున్నారు. దాని వల్ల తమకు అవకాశాలు వస్తాయని పదేళ్లకి పైగా పార్టీ కోసం పడిన కష్టానికి తగిన ఫలితం దక్కుతుందని కూడా భావిస్తున్నారు. ఇక గత కొంతకాలంగా జనసేనలో ఉన్న అభిప్రాయాలు వారి ఆలోచనలకు తగిన విధంగా అధినాయకత్వం కూడా రియాక్ట్ అయింది. జనసేన 2024 ఫార్ములాతో కాదని 2026 కి వచ్చేసరికి బలం పెరిగింది కాబట్టి ఎక్కువ సీట్లు దక్కాలని కూడా నేతల నుంచి డిమాండ్ వచ్చింది. దానికి తగినట్లుగానె 30 శాతం ఫార్ములా అన్నది ఇపుడు ప్రచారంలో ఉంది.

**ఈ రేషియో అమలు అయితే :**

జనసేన పెద్దలు ఈ మధ్య దాకా చెప్పినట్లుగా 30 శాతం సీట్ల సర్దుబాటు కనుక అమలు అయితే ఏపీలో ఉన్న 17 కార్పోరేషన్లలో అయిదారు మేయర్ పీఠాలు దక్కాలి. అలాగే ఎనభై కి పైగా ఉన్న మునిసిపాలిటీలు నగర పాలికలలో 30 దాకా లభించాయి. ఇక 28 దాకా ఉన్న జెడ్పీ పీఠాలలో తొమ్మిది దాకా లభించాలి. రెండు వందల జడ్పీటీసీలు, వేలాదిగా ఉన్నఎంపీటీసీలు కూడా పొత్తు వాటాలో దక్కాలి. మరి ఈ విధంగానే ఆశలు పెంచుకుని జనసేన నేతలు దిగువ స్థాయిలో పని చేసుకుని పోతున్నాయి. అయితే జనసేనలో నంబర్ టూ అయిన మంత్రి నాదెండ్ల మనోహర్ అయితే తాపీగా చెప్పాల్సింది చెబుతున్నారు. అదేంటి అంటే ఎక్కువగా అంచనాలు పెంచుకోవద్దు అని. దాంతోనే ఇపుడు జనసేన నేతలలో కొత్త రకం ఆందోళన పెరిగిపోతోంది అని అంటున్నారు.

**జనసేన సమావేశంలో నాదెండ్ల :**

విశాఖలో తాజాగా జరిగిన పార్టీ ఆత్మీయ సమావేశంలో జనసేన నంబర్ టూ నేత అయిన నాదెండ్ల మనోహర్ చేసిన వ్యాఖ్యలు అయితే ఆ పార్టీలో రాజకీయ కలకలం రేపుతున్నాయి. ఆయన అన్నది చూస్తే జనసేనకి 60–70 సీట్లని ఎక్స్పెక్ట్ చేయడం మంచిది కాదు అని. అనే కాదు పదవి అధికారంతో పాటు పార్టీకి బాధ్యత కూడా ఉంది అని అన్నారు. , మనం గెలిచే సీట్లు తప్పకుండా తీసుకుందామని మరో మాట అన్నారు. ఇక ఆయన చెప్పినది చూస్తే కూర్చొన్న కొమ్మను నరుక్కోవద్దు అన్న సందేశం కూడా ఉంది. జనసేనాని పవన్ కళ్యాణ్ ఆలోచనలను సైనికులే అర్థం చేసుకోకపోతే ఎలా అని కూడా నాదెండ్ల ప్రశ్నించారు.

**సంస్థాగతంగా బలం :**

అదే మీటింగులో నాదెండ్ల మరిన్ని వ్యాఖ్యలు చేశారని అంటున్నారు. సంస్థాగతంగా జనసేన ఇంకా బలపడాల్సి ఉందని ఆయన చెప్పారు అని చెబుతున్నారు. ఒక పార్టీగా జనసేన నెమ్మదిగా ఎదగాల్సి ఉందని కూడా సూచించారు. ఏతా వాతా నాదెండ్ల మనోహర్ చెప్పేది ఏంటి అంటే బలం ఉన్న చోటనే పోటీ అని. మరి ఆ బలం ఎంత ఉంది ఏమిటి అన్నది ఎవరు తేలుస్తారు అన్నదే ఇపుడు జనసైనికులకు కలుగుతున్న కీలక ప్రశ్న. జనసేన బలం ఇంతే అని ఇచ్చినన్ని సీట్లు తీసుకుంటే ఇంక మనం ఎప్పటికి ఎదిగేది అని జనసైనికులు అయితే మండిపడుతున్నారు. ఏ పార్టీ అయినా కొత్తగా స్థానాలలో పోటీ చేస్తే కదా బలం ఎంత ఉంది అన్నది తెలిసేది అని ప్రశ్నిస్తున్నారు.

**ఆ నాలుగు జిల్లాలు చాలవా :**

జనసేనకు ఏపీ అంతా అవసరం లేదు కేవలం కృష్ణా,ఈస్ట్, వెస్ట్, వైజాగ్ ఇలా చూస్తే నాలుగు జిల్లాల్లో టీడీపీ–జనసేన బలం 60–40 గా ఉంటునని కూడా జనసైనికులు సూచిస్తున్నారు. కాబట్టి ఈ నాలుగు జిల్లాల్లో అయినా 60–40 పద్దతిలో సీట్లు పంచటం న్యాయం అని వాదిస్తున్నారు. ఇక్కడ చూస్తే మేయర్ జెడ్పీ పీఠాలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. వీటితో పాటు మునిసిపాలిటీలలో కూడా జనసేనకు న్యాయమైన వాటా ఇవ్వాలని కోరుతున్నారు. మొత్తానికి నాదెండ్ల అయితే చెప్పాల్సింది చెప్పారు అంటే జనసేనకు ఎన్ని సీట్లు దక్కుతాయన్న గుబులు అయితే పార్టీ వర్గాలలో ఉంది. తొందరలోనే చంద్రబాబు పవన్ బీజేపీ నేతలు సీట్ల సర్దుబాటు మీద కూర్చో బోతున్నారు అని అంటున్నారు. జనసేనకు నిజంగా 30 శాతం ఫార్ములా ప్రకారం సీట్లు వస్తాయా లేక నాదెండ్ల చెప్పినట్లుగా బలం ఉన్న చోట్ల సీట్లు దక్కుతాయా అన్నది చూడాల్సి ఉంది అని అంటున్నారు.

## తిరుమలకు పోటెత్తిన భక్తులు.. దర్శన సమయం ఎంతంటే?




**హైదరాబాద్ పెన్ పవర్:** తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. గత కొన్ని రోజులుగా భక్తుల రద్దీ కొనసాగుతుంది. బ్రహ్మోత్సవాలు జరుగుతుండటంతో పాటు వరస సెలవులు రావడంతో భక్తుల రద్దీ పెరిగింది. నిన్న గరుడ వాహన సేవకు లక్షల సంఖ్యలో హాజరయిన భక్తులు నేడు స్వామి వారి దర్శనం కోసం వేచి చూస్తున్నారు. దీంతో తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నిన్న ఫోర్ వీలర్లను కూడా తిరుమల కొండపైకి అనుమతించలేదు. పార్కింగ్ సౌకర్యం ఇబ్బందికరంగా మారడంతో అనుమతించలేదు. కేవలం టీటీడీ బస్సుల ద్వారానే కొండపైకి భక్తుల రాకపోకలు నిన్నంతా సాగాయి. నేడు వసతి గృహాలు కొరత కూడా కొనసాగుతుంది.

**నేడు వాహన సేవలివీ...**

తిరుమలలో బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 23వ తేదీ వరకూ జరగనున్నాయి. దీంతో తిరుమలకు వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు చెబుతున్నారు. తిరుమలలో వైభవంగా శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఈరోజు ఉదయం ఎనిమిది గంటలకు హనుమంత వాహన సేవ జరిగింది. సాయంత్రం నాలుగు గంటలకు స్వర్ణరథంపై మలయప్పస్వామి విహరించనున్నారు. రాత్రి ఏడు గంటలకు గజ వాహన సేవ ఉంటుంది. మాడ వీధుల్లో మలయప్పస్వామిని దర్శించేందుకు భక్తులు ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

**31 కంపార్ట్ మెంట్లలో...**

తిరుమలలో నేడు వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లోని 31 కంపార్ట్ మెంట్లలో శ్రీవారి దర్శనం కోసం భక్తులు వేచి ఉన్నారు. సర్వదర్శనం కోసం క్యూ లైన్ లోకి ఉదయం టోకెన్లు లేకుండా ప్రవేశించిన భక్తులకు శ్రీవారి దర్శనం ఎనిమిది గంటల సమయం పడుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు తెలిపారు. నిన్న శ్రీవారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య 83,589 గా ఉంది. శ్రీవారికి తలనీలాలు సమర్పించిన భక్తులు 27,828గా ఉందని అధికారులు తెలిపారు. నిన్న శ్రీవారి హుండీ ఆదాయం రూ. 4.17 కోట్లు వచ్చిందని అధికారులు తెలిపారు. నిన్న శ్రీవారి లడ్డూ ప్రసాదం అమ్మకం 4.77 లక్షల మేరకు జరిగాయి. అన్న ప్రసాదం స్వీకరించిన భక్తుల సంఖ్య 7.04 లక్షల మంది అని అధికారులు తెలిపారు. నేడు ఆదివారం కావడంతో భక్తుల రద్దీ కొనసాగే అవకాశముంది.

# టీమిండియాతో ఇంత త్వరగా టీ20 మ్యాచ్.. జపాన్ కోచ్ ఆశ్చర్యం

- భారత్‌తో మ్యాచ్ జరగనుందని నెల క్రితం వరకు తమకు తెలియదని చెప్పిన జపాన్ కోచ్
- ప్రధానుల స్థాయిలో జరిగిన చర్చల ఫలితంగానే ఈ మ్యాచ్ సాధ్యమైందని వెల్లడి
- ప్రపంచ ఛాంపియన్‌తో ఆడటం తమకు దక్కిన అద్భుతమైన అవకాశమని వ్యాఖ్య
- ఈ మ్యాచ్ ద్వారా జపాన్‌లో భవిష్యత్ తరాలకు స్ఫూర్తినివ్వడమే తమ లక్ష్యమన్న కోచ్



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ ఛాంపియన్ భారత్‌తో టీ20 మ్యాచ్ ఆడతామనే విషయం నెల రోజుల క్రితం వరకు తమకు కనీసం తెలియదని జపాన్ క్రికెట్ జట్టు హెడ్ కోచ్ డుగాల్ బెడింగ్‌ఫీల్డ్ ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. ఇదొక ఊహించని, అద్భుతమైన అవకాశమని అభివర్ణించాడు. ఇరు దేశాల ప్రధానుల స్థాయిలో జరిగిన ఉన్నతస్థాయి చర్చల తర్వాతే ఈ మ్యాచ్ హఠాత్తుగా ఖరారైందని బెడింగ్‌ఫీల్డ్ వెల్లడించాడు. ఈ చారిత్రక మ్యాచ్ కోసం తమ జట్టు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తోందని తెలిపాడు. మంగళవారం టోచిగి ప్రిఫెక్చర్‌లోని సానో అంతర్జాతీయ క్రికెట్ గ్రౌండ్‌లో సుజుకి కప్ కోసం భారత్, జపాన్ జట్ల మధ్య ఈ టీ20 మ్యాచ్ జరగనుంది. ఇప్పటికే ఈ మ్యాచ్ టికెట్లన్నీ అమ్ముడయ్యాయి. మరో రెండు రోజుల్లో ప్రారంభం కానున్న ఆసియా క్రీడలకు సన్నాహకంగా ఈ మ్యాచ్ ఉపయోగపడనుంది. ఆసియా క్రీడల్లో శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని భారత జట్టు నేరుగా క్వార్టర్ ఫైనల్స్‌లో ఆడనుండగా, జపాన్ తన తొలి మ్యాచ్‌లో ఆఫ్ఘనిస్థాన్‌తో తలపడనుంది. ఐఏఎన్ఎస్ వార్తా సంస్థతో ప్రత్యేకంగా మాట్లాడుతూ బెడింగ్‌ఫీల్డ్ పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. "ఈ మ్యాచ్ గురించి విన్నప్పుడు మొదట నమ్మలేకపోయాం. ఇది వందకు వంద శాతం మాకు ఆశ్చర్యం కలిగించింది. ప్రపంచ నంబర్ వన్ జట్టుతో ఆడేందుకు ఇదొక అద్భుతమైన అవకాశం. జపాన్‌లో నివసిస్తున్న భారతీయులు కూడా ఈ మ్యాచ్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మైదానంలో గొప్ప వాతావరణం ఉంటుందని ఆశిస్తున్నాం" అని అన్నాడు.

అయితే, జట్టు సన్నద్ధతకు కొన్ని సవాళ్లు ఉన్నాయని బెడింగ్‌ఫీల్డ్ అంగీకరించాడు. "మా ఆటగాళ్లు దేశవిదేశాల్లోని వివిధ ప్రాంతాల్లో ఉంటారు. మే నెల తర్వాత మా పూర్తి జట్టు కలిసి శిక్షణ తీసుకుంది ఇప్పుడే. టెక్నాలజీ సాయంతో ఆటగాళ్లను సమన్వయం చేస్తున్నాం. మరోవైపు, వర్ష సూచన కూడా ఆందోళన కలిగిస్తోంది. అయినా, మ్యాచ్ సజావుగా సాగుతుందని ఆశిస్తున్నాం" అని తెలిపాడు.

భారత జట్టు ఫైర్‌పవర్‌ను ఎదుర్కోవడం పెద్ద సవాలని బెడింగ్‌ఫీల్డ్ పేర్కొన్నాడు. "భారత్ వంటి మేటి జట్ల ఆటగాళ్ల విధ్వంసక శక్తి ముందు కొన్నిసార్లు చిన్న జట్లు కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. అయితే, ఈ ఒత్తిడిని అధిగమించి, మైదానంలో గట్టి పోటీ ఇవ్వాలని మేం లక్ష్యంగా పెట్టుకున్నాం"

అని వివరించాడు. 2020లో అండర్-19 ప్రపంచకప్‌లోనూ భారత జట్టుతో తలపడిన అనుభవాన్ని గుర్తుచేసుకున్నాడు. ఆనాడు యశస్వి జైస్వాల్, రవి బిష్ణోయ్ వంటి ఆటగాళ్లున్న భారత జట్టు చేతిలో తమ జట్టు ఓడిపోయిందని, అది గొప్ప అనుభవమని అన్నాడు. ఇప్పుడు సీనియర్ల స్థాయిలో మరోసారి భారత్‌తో ఆడటం ఆసక్తికరంగా ఉందని తెలిపాడు. ఈ మ్యాచ్ ఫలితంతో సంబంధం లేకుండా, జపాన్‌లో క్రికెట్‌కు ప్రాచుర్యం కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని బెడింగ్‌ఫీల్డ్ స్పష్టం చేశాడు. "మా ప్రదర్శన ద్వారా జపాన్‌లో భవిష్యత్ తరాల క్రీడాకారులకు స్ఫూర్తినివ్వాలనుకుంటున్నాం. వేలాది మంది పిల్లలు క్రికెట్‌ను తమ క్రీడగా ఎంచుకునేలా చేయడమే మా అంతిమ లక్ష్యం" అని తెలిపాడు. భారత్-జపాన్ దౌత్య సంబంధాల 75 వసంతాల వేడుకలో భాగంగా ఈ మ్యాచ్ ఏర్పాటు చేశారు. సెప్టెంబరు 22న జపాన్ లోని సానో ఇంటర్నేషనల్ గ్రౌండ్ లో ఈ చారిత్రక మ్యాచ్ జరగనుంది.

# టీ20 క్రికెట్‌లో స్మృతి మంధాన సంచలనం.. బాబర్, బట్లర్‌లను వెనక్కి నెట్టి ప్రపంచ రికార్డు!





**హైదరాబాద్ పెన్ పవర్:** భారత మహిళా క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్, స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన తన కెరీర్‌లో మరో అద్భుతమైన మైలురాయిని అందుకుంది. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించింది. పురుషులు, మహిళల క్రికెట్‌లో కలిపి అత్యధిక పరుగులు సాధించిన క్రీడాకారిణిగా ఆమె ప్రపంచ రికార్డు నెలకొల్పింది. ఆసియా క్రీడల సెమీఫైనల్‌లో బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ అరుదైన ఘనతను ఆమె సొంతం చేసుకుంది. కొరోగి స్పోర్ట్స్ పార్క్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో మంధాన కేవలం 19 బంతుల్లో 37 పరుగుల మెరుపు ఇన్నింగ్స్ ఆడింది. ఈ క్రమంలో న్యూజిలాండ్ మాజీ క్రీడాకారిణి సూజీ బేట్స్ పేరిట ఉన్న రికార్డును ఆమె అధిగమించింది. ఈ మ్యాచ్‌కు ముందు మంధాన 170 ఇన్నింగ్స్‌లలో 4,751 పరుగులతో రెండో స్థానంలో ఉండగా, రికార్డు బ్రేక్ చేయడానికి కేవలం 8 పరుగులు అవసరమయ్యాయి. తన ఇన్నింగ్స్ ఆరంభంలోనే రెండు ఫోర్లు, రెండు సింగిల్స్‌తో ఈ మార్కును సులభంగా దాటేసింది. తాజా రికార్డుతో మంధాన 171 ఇన్నింగ్స్‌లలో 4,788 పరుగులతో అగ్రస్థానానికి చేరుకుంది. ఈ జాబితాలో మంధాన, సూజీ బేట్స్ (4,758) తర్వాత పురుషుల టీ20ల్లో అగ్రగామిగా ఉన్న పాకిస్థాన్ కెప్టెన్ బాబర్ ఆజం (4,596) మూడో స్థానంలో ఉన్నాడు. వీరి తర్వాత జోస్ బట్లర్ (4,292), భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (4,287) వరుసగా నాలుగు, ఐదు స్థానాల్లో కొనసాగుతున్నారు. ఈ రికార్డుతో మంధాన పురుషుల క్రికెట్‌లోని అగ్రశ్రేణి ఆటగాళ్లను కూడా వెనక్కి నెట్టడం విశేషం.

ఇక ఆసియా క్రీడల సెమీఫైనల్ విషయానికొస్తే, ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. 2023లో జరిగిన హాంగ్‌జౌ గేమ్స్‌లో స్వర్ణ పతకం గెలుచుకున్న భారత జట్టు, ఈసారి కూడా టైటిల్‌ను నిలబెట్టుకోవాలని పట్టుదలతో ఉంది. అంతకుముందు క్వార్టర్‌ఫైనల్‌లో ఆతిథ్య జపాన్‌ను ఓడించి సెమీస్‌కు చేరుకుంది.

## షఫాలీ శతక విధ్వంసం.. బంగ్లా బేజారు.. సూపర్ విక్టరీతో ఫైనల్‌కు భారత్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆసియా క్రీడల మహిళల క్రికెట్‌లో భారత జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. యువ ఓపెనర్ షఫాలీ వర్మ ఆకాశమే హద్దుగా చెలరేగి అద్భుత శతకంతో కదం తొక్కడంతో సెమీ ఫైనల్‌లో బంగ్లాదేశ్‌పై భారత్ 114 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో స్వర్ణ పతక పోరుకు అర్హత సాధించి, పతకాన్ని ఖాయం చేసుకుంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన భారత జట్టు, బంగ్లాదేశ్‌ను చిత్తుగా ఓడించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్, ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. ఓపెనర్లు షఫాలీ వర్మ, స్మృతి మంధాన బంగ్లా బౌలర్లపై విరుచుకుపడ్డారు. కేవలం 28 బంతుల్లోనే 50 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ క్రమంలో మంధాన 16 బంతుల్లో 27 పరుగులు చేసి ఔటైనా, పవర్ ప్లే ముగిసేసరికి భారత్ వికెట్ నష్టానికి 72 పరుగులతో పటిష్ఠ స్థితిలో నిలిచింది.

మరోవైపు షఫాలీ తన జోరును కొనసాగించింది. కేవలం 24 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసుకుని బంగ్లా బౌలింగ్‌ను చీల్చి చెండాడింది. అనంతరం కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌తో జతకలిసిన షఫాలీ, మరో కీలక భాగస్వామ్యాన్ని నిర్మించింది. వీరిద్దరూ కలిసి 50 పరుగులకు పైగా జోడించి స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. ఈ క్రమంలో షఫాలీ తన విధ్వంసక ఇన్నింగ్స్‌ను కొనసాగిస్తూ కేవలం 49 బంతుల్లోనే అజేయ శతకాన్ని పూర్తి చేసుకుంది. ఆమె ఇన్నింగ్స్‌లో 9 భారీ సిక్సర్లు, 3 ఫోర్లు ఉన్నాయి. 204.08 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేసిన షఫాలీ చివరి వరకు క్రీజులో నిలిచింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 33 బంతుల్లో 40 పరుగులతో ఆమెకు అండగా నిలవడంతో, భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 195 పరుగుల భారీ స్కోరు సాధించింది.

196 పరుగుల భారీ లక్ష్య ఛేదనతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్, ఆరంభం నుంచే తీవ్ర ఒత్తిడికి గురైంది. భారత బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్ ధాటికి క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. పవర్ ప్లే ముగిసే సమయానికే 39 పరుగులకు 3 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ తర్వాత కూడా బంగ్లా ఇన్నింగ్స్ ఏ దశలోనూ కోలుకోలేదు. భారత బౌలర్లు విజృంభించడంతో 9 ఓవర్ల తర్వాత 49 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. చివరకు 15.4 ఓవర్లలో కేవలం 81 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో భారత జట్టు 114 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి ఫైనల్లో అడుగుపెట్టింది. ఈ అద్భుత ప్రదర్శనతో భారత జట్టు స్వర్ణ పతకంపై కన్నేసింది.

# మహేష్ ఇంకో 17 రోజులే.. ఆ తర్వాత జక్కన్న నుంచి విముక్తి!







దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక పాన్-వరల్డ్ చిత్రం 'వారణాసి' పై ప్రస్తుతం సర్వత్రా ప్రజల్లో ఆసక్తి నెలకొంది. మహేష్ బాబు కథానాయకుడిగా నటిస్తున్న ఈ సినిమాకు సంబంధించి తాజా అప్‌డేట్స్ సినిమాపై అంచనాలను విపరీతంగా పెంచేస్తున్నాయి. ఈ చిత్రానికి సంబంధించిన వారణాసి షెడ్యూల్ అక్టోబర్ మొదటి వారానికల్లా పూర్తిగా ముగియనుందని సమాచారం. ఈ భారీ యాక్షన్ అడ్వెంచర్ చిత్రంలో సూపర్ స్టార్ మహేష్ బాబుకి సంబంధించిన కీలకమైన పోర్షన్స్ అన్నీ కేవలం వారంలోనే పూర్తికానున్నట్లు తెలుస్తోంది. రాజమౌళి ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న ఈ గ్రాండ్ స్కేల్ ఎంటర్‌టైనర్‌ను 7 ఏప్రిల్ 2027న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. చెప్పిన తేదీ ప్రకారం రావాలంటే పోస్ట్ ప్రొడక్షన్ పనుల్ని వేగంగా పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇకపై ఎలాంటి ఆలస్యం లేకుండా జక్కన్న నిర్మాణానంతర పనులపై దృష్టి సారిస్తారని కూడా తెలుస్తోంది. సినిమా కంటెంట్ మ్యాటర్ కి వస్తే.. ఈ చిత్రంలో వారణాసి నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు అత్యంత కీలకం కానున్నాయి. పురాతన నగర వాతావరణం, ఆధ్యాత్మికతతో పాటు రాజమౌళి మార్క్ విజువల్స్ ఈ షెడ్యూల్‌లో ప్రధాన ఆకర్షణగా చిత్రీకరిస్తున్నారు. కేవలం రియల్ లోకేషన్స్ మాత్రమే కాకుండా.. సినిమాలోని అత్యున్నత విజువల్ ఎఫెక్ట్స్ కోసం భారీ సెట్లను సైతం చిత్ర యూనిట్ ఉపయోగించినట్లు సమాచారం. ఇక 'వారణాసి' షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకున్న తర్వాత సూపర్ స్టార్ మహేష్ బాబు చేయాల్సిన తదుపరి చిత్రంపై కూడా ఇప్పటికే చర్చలు జరుగుతున్నాయి. రాజమౌళి సినిమా తర్వాత మహేష్ బాబు ఎవరి దర్శకత్వంలో నటిస్తారనే దానిపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. టాలీవుడ్ వర్గాల సమాచారం ప్రకారం పలువురు టాప్ డైరెక్టర్లు మహేష్ కోసం కథలతో సిద్ధంగా ఉన్నారు. మరోవైపు 'వారణాసి' సినిమాకు సంబంధించిన బిజినెస్ డీలింగ్స్ కూడా ఇప్పటికే పీక్స్‌కు చేరాయి. రాజమౌళి బ్రాండ్ ఇమేజ్, మహేష్ బాబు గ్లోబల్ మార్కెట్ కారణంగా ఈ సినిమా నాన్-థియేట్రికల్ రైట్స్, ఓవర్సీస్ హక్కులు , శాటిలైట్ డీల్స్ అన్నీ కూడా రికార్డు స్థాయి ధరలకు అమ్ముడవుతున్నట్లు ట్రేడ్ వర్గాల్లో భారీ చర్చ నడుస్తోంది. ఇండియన్ సినిమా హిస్టరీలోనే బిగ్గెస్ట్ బిజినెస్ జరిగే ప్రాజెక్ట్‌లలో ఒకటిగా ఇది నిలవనుంది. తాజా సమాచారం మేరకు మహేష్ బాబు ఇంకో 17 రోజుల పాటు చిత్రీకరణను పూర్తి చేస్తే.. ఆ తర్వాత జక్కన్న నుంచి విముక్తి లభించినట్టేనన్న చర్చ సాగుతోంది!

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D.No:10-11G-60/1, Flat No.4, Keelapatla Road Cross, Bangalore ByPass Road,Gangavaram MDL,Palamaneru Chittoor Dist, Editor Gantyada Apparao. PRGI Registration No. " APTEL/25/A4274 " e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965